J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 40 సంచిక : 50 14.5.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జమిలి ఎన్నికలు ఇక లేనట్లే



- బెంగాల్ ఓటమితో మారిన సీను
- ఆత్మరక్షణలో బీజేపీ
- 2022, 23లోనూ రాష్ట్రాల ఎన్నికలు
- జమిలికి వెళితే అసలుకే ఎసరు

**ఈమధ్య కాలంలో దేశ రాజకీయవర్గాలు, ఆసక్తిపరులలో బాగా నానిన పదం 'జమిలి' ఎన్నికలు. అంటే లోకసభకు, రాష్ట్రాల శాసనసభలకు, రాష్ట్రాలలోని సమస్త స్థానిక సంస్థలకు ఏకకాలంలో అయిదు సంవత్సరాలకు ఒక్కసారి, ఒకే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించడం. ఈ ఐదేళ్లలో రాష్ట్రాలలోగానీ.. కేంద్రంలో గానీ ఎన్నికైన ప్రభుత్వాలు కూలిపోయినా ఎన్నికలు ఉండవు. కేంద్రంలో అయితే రాష్ట్రపతి, రాష్ట్రంలో అయితే గవర్నర్ పాలిస్తారు. మళ్లీ ఐదేళ్లు పూర్తి అయితేనే... ఎన్నికలు. ఒక రాష్ట్రంలో ఎన్నికైన ప్రభుత్వం ఒక ఏడాదిలో పడిపోతే మిగిలిన నాలుగేళ్ళూ ఆ రాష్ట్ర గవర్నరే పాలిస్తారు. ఆ నాలుగేళ్ళూ ప్రజాప్రభుత్వం ఉండదు.**

ఈ ఆలోచనపై కేంద్ర బీజేపీ పెద్దలు గత మూడేళ్ళుగా భారీ కసరత్తు చేశారు. 'ఒకే దేశం – ఒకేసారి ఎన్నికలు' అనేది కాన్సెప్ట్ అయినా 'ఒకే దేశం, ఒకే నాయకుడు' అన్నది బీజేపీ అసలు వ్యూహం. 2020లో దాదాపు 80 వీడియో సమావేశాల ద్వారా ఈ విధానాన్ని బీజేపీ ప్రచారం చేసింది. ఈ ప్రక్రియను ప్రధాని మోడీ సైతం పదే పదే ప్రస్తావిస్తూ వచ్చారు.

2లో




## కరోనా బాధితులకు డిఆర్‌డిఓ దివ్యౌషధం



## '2-డీజీ'

- త్వరలోనే రానున్న పొడి మందు

**భౌతిక యుద్ధమే కాదు, బయో యుద్ధం వచ్చినా ఎదుర్కోవడానికి తామెప్పుడూ సిద్ధమే అని భారతీయ పరిశోధకులు నిరూపిస్తున్నారు. మన సతీష్‌రెడ్డి సారథ్యంలోని డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు, ఆయుధాలతో పాటు ఔషధాలను తయారు చేయడంలోనూ తామేం తక్కువ కాదని మోర విరుచుకుని మరీ చెప్తున్నారు.**

కరోనా బాధితులు త్వరగా కోలుకునేందుకు, వారి అత్యవసర వినియోగానికి మన దేశంలోని డిఆర్‌డిఓ సంస్థ '2–డీజీ' పేరుతో ఒక అద్భుతమైన ఔషధాన్ని సిద్ధం చేస్తోంది. దీంతో డిఆర్‌డిఓ ప్రపంచ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. కోవిడ్ బాధితులకు ఇది దివ్యౌషధంగా పని చేస్తుందని అందరూ భావిస్తున్నారు. అందుకే, ఇప్పుడు అందరి దృష్టి.. '2–డీజీ'పైనే ఉంది. ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కోవిడ్–19ను నియంత్రించేందుకు భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డిఆర్‌డిఓ) సిద్ధం చేస్తున్న ఆ అద్భుతమైన ఔషధంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కరోనా మహమ్మారిపై బ్రహ్మాస్త్రం లాంటి దివ్యౌషధాన్ని ఎక్కు పెట్టడానికి డిఆర్‌డిఓ సమాయత్తం కావడం సర్వత్రా సంచలనం కలిగిస్తోంది.

2లో



బి.వి.నగేష్ (బాబు)

బెంగుళూరు

జననం : 25.10.1957 మరణం : 06.05.2021

## కన్నీటి నివాళి

**బాబన్నా...**

మన ఏ జన్మ సంబంధమో, ఈ జన్మలో మిత్రబంధమై,
ఆత్మీయ అనుబంధమై,
మధురానుబంధంగా ముడిపడిపోయింది.

మాకొక మంచి హితుడిగా, సన్నిహితుడిగా, స్నేహితుడిగా
మాతో మీరు గడిపిన క్షణాలు మరపురానివి, మరువలేనివి.

నిజమైన స్నేహానికి నిలువెత్తు నిదర్శనం మీరు,
మంచితనం, మానవీయతకు మరో పేరు మీరు.

మీ తియ్యని పిలుపు, మీ కమ్మని పలుకు
ఇక లేవంటే నమ్మలేకున్నాం.

**నేస్తమా...**

మీ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ... కన్నీటి నివాళి అర్పిస్తున్నాం.
సదా మీ స్మృతిలో...

మీ.. కొండా రవి
మరియు
మిత్రులు, శ్రేయోభిలాషులు

# జమిలి ఎన్నికలు ఇక లేనట్లే

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యూహం అమలుకు ఇప్పుడు బ్రేకులు పడినట్టేనని ఢిల్లీ పరిశీలకులు వ్యాఖ్యా నిస్తున్నారు. మొన్న జరిగిన 4 రాష్ట్రాల (పుదుచ్చేరి రాష్ట్రం కాదు) ఎన్నికల ఫలితాలు, జమిలి ఎన్నికల ఆలోచనపై నీళ్లు చల్లాయని అంటున్నారు. కేరళలో అసలు ఖాతా కూడా తెరవలేక పోవడం (రద్దు అయిన శాసన సభలో ఒక సీటు ఉంది), తమిళనాడులో ఓ నాలుగు సీట్లకే పరిమితం కావడం, బెంగాల్‌లో 294 స్థానాలకుగానూ 77 వద్దే ఆగిపోవడంతో, బీజేపీ రథసారధి అయిన ప్రధాని మోడీ ప్రభ మసక బారిందనే విశ్లేషణలు విస్తృ తంగా వెలువడుతున్నాయి. ఈ ఎన్నికల్లో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విశ్వరూపాన్ని బీజేపీ నేతలు దగ్గరనుంచి చూశారు. గత రెండు పర్యాయాలలో తృణమూల్ కాంగ్రెస్ సాధించిన స్థానాల కంటే కూడా ఎక్కువగా మూడింట రెండు వంతుల ఆధిక్యతను ఈసారి మమతకు బెంగాల్ ఓటర్లు కట్టబెట్టారు. డబ్బు, కేంద్ర వ్యవస్థలు, మోడీ... షా వ్యూహాలు, 8 దశల్లో పోలింగ్ ప్లాన్ వంటి సమస్త వ్యూహాలు అమలు చేసినా బీజేపీకి ఫలితం దక్కలేదు.

గత ఏడేళ్లుగా నరేంద్ర మోడీకి ధీటు రాగల ప్రత్యామ్నాయం లేదనే భావనలో ఉన్న బీజేపీ 'జమిలి ఎన్నికల' వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. 2022 చివరికో.., 2023 మొదట్లోనే ఈ జమిలి ఎన్నికలు తథ్యం అనే వాతావరణం దేశంలో ఏర్ప డింది. రాజకీయవర్గాలు కూడా ఈ జమిలి ఎన్నికలకు మానసికంగా సిద్ధమయ్యాయి.

అయితే, మొన్న జరిగిన 4 రాష్ట్రాల ఎన్నికలు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేశాయనేది పలువురు రాజకీయ వ్యాఖ్యాతల మాటగా వినబడుతున్నది.

మోడీ వ్యతిరేక రాజకీయ శిబిరానికి మమతా బెనర్జీ రూపంలో ఒక ప్రత్యా మ్నాయం తెరపైకి వచ్చింది. కేరళ, తమిళ నాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహా రాష్ట్ర, బెంగాల్, ఉత్తరప్రదేశ్, కశ్మీర్ వంటి పలురాష్ట్రాల్లో బలమైన స్థానిక నాయక త్వాలు మమత నేతృత్వంలో సంఘటితం అయ్యే సూచనలు వెలువడుతూ ఉండ డంతో జమిలి ఎన్నికల ఆలోచన అటకె క్కిందనే భావనలు వ్యక్తమవుతున్నాయి.

దీనికితోడు, విజృంభించిన కోవిడ్ మహమ్మారి ప్రధానిగా మోడీ ప్రతిష్ట మొత్తాన్ని దిగజార్చింది. కేంద్రం ఏమి చేయాలో... ఏమి చేయగూడదో న్యాయ స్థానాలు నిర్దేశిస్తున్నాయి. ఆ ఆదేశాలను అమలు చేయకపోతే... కోర్టు ధిక్కారంగా పరిగణిస్తాం అంటున్నాయి. ఏడేళ్లుగా ఏకఛత్రాధిపత్యంగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వానికి ఇంతకు మించిన తలవం పుల చర్య మరోటి లేదని అంటున్నారు. దీనితో, బీజేపీతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయి ఆత్మరక్షణలో పడి పోయింది. జమిలి ఎన్నికలంటూ పాట పాడడం కంటే 2024 మేలో జరగవలసి ఉన్న లోకసభ ఎన్నికల సమయంలోపు ప్రతిష్ఠను పునరుద్ధరించుకోవడం బీజేపీకి, ప్రధానికి అత్యంత ముఖ్యం అనడంలో సందేహం లేదు.

## 2022లో మళ్లీ ఎన్నికలు

ఈ కరోనా కల్లోలం సమసి పోక ముందే... 2022లో మరో ఏడు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగవలసి ఉంది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజ రాత్, గోవా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్ శాసనసభలకు 2022లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, గోవా (కేంద్ర పాలిత ప్రాంతం) రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయి. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది.

ఇందులో మణిపూర్, హిమాచల్ ప్రదేశ్ తప్ప ఏ రాష్ట్రంలోనూ బీజేపీ అంత తేలికగా గెలిచే పరిస్థితులు లేవని అంటు న్నారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్‌యాదవ్ నుంచి, గుజరాత్... గోవా, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లో కాంగ్రెస్ నుంచి బీజేపీ తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నది.

కేవలం కాంగ్రెస్ బలహీనపడిన కార ణంగా భాజపా పుంజుకున్న రాష్ట్రాలలో ఇప్పుడు ఎవరైనా బలమైన నాయకులు ప్రాంతీయ నినాదంతో కొత్త పార్టీ పెడితే బీజేపీకి కూడా కాంగ్రెస్‌కి ఎదురైన చేదు అనుభవాలే ఆయా రాష్ట్రాలలో ఎదురవు తాయన్న వాదం కూడా బలంగా విన పడుతోంది. మళ్లీ 2023లో మరో 3 పెద్ద రాష్ట్రాలు కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు ఎన్నికల మోహం చూడాల్సి ఉంది. ఇవన్నీ బీజేపీ 'జమిలి' ఆలోచనలకు ప్రతిబంధకాలే అన్నది విశ్లేషకుల మాట. అందువల్ల బీజేపీ గానీ, మోడీ గానీ జమిలి ఎన్నికలు అనే మాట ఎత్తకపోవచ్చు.

## ఏమిటీ 'జమిలి' ఎన్నికలు?

జమిలి ఎన్నికలు అంటే లోకసభకు, రాష్ట్రాల శాసన సభలకు ఒకేసారి ఎన్ని కలు నిర్వహించడం... తద్వారా ఎన్నికల వ్యయం తగ్గించడం... అని పైకి కనబడు తున్నప్పటికీ... ఇది ఒక 'పొలిటికల్ పాండి మోనియం' అని భారత ప్రజాస్వామిక అభిమానులు గగ్గోలు పెడుతున్నారు. జమిలి అంటే భారత రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చి వేయడమే అని సీపీఎం పూర్వపు కార్యదర్శి ప్రకాష్‌కారత్ ఆక్రోశం వెలిబుచ్చుతున్నారు. దేశంలోని ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తికి మంగళం పాడడమే అన్నది రాజ్యాంగ నిపుణుల మాట. 'జమిలి' కాన్సెప్ట్ ప్రకారం లోకసభలో మెజారిటీ లేకపోతే మళ్లీ ఐదేళ్లవరకు రాష్ట్రపతే నేరుగా దేశాన్ని పాలిస్తారు. మన రాజ్యాం గంలో రాష్ట్రపతి సెరిమోనియల్ హెడ్ మాత్రమే. పాలన అన్నది ప్రధాని నేతృత్వం లోని మంత్రివర్గం బాధ్యత. వారు ప్రజలకు జవాబుదారీగా ఉంటారు వారి స్థానంలో కేంద్రంలో రాష్ట్రపతి గానీ... రాష్ట్రాలలో గవర్నర్లు గానీ పాలన చేపట్టాల్సిన పరిస్థి తులు ఎదురైతే వారు ఎవరికీ జవాబు దారీగా ఉండాల్సిన పని లేదు. అంటే వారిని ఆ పదవులలోకి తీసుకువచ్చిన వారిదే పాలన అన్నమాట. ఈ పోకడ ఎంత ప్రమాదకరమో చెప్పాల్సిన పని లేదని వ్యవస్థను విచ్ఛిన్నం చేసే ఈ జమిలి ఆలోచన 'బెంగాల్ దెబ్బకు' అటకెక్కినట్టేనని పరిశీలకులు భావిస్తున్నారు.

# '2-డీజీ'

(మొదటి పేజీ తరువాయి)

కరోనాను నిరోధించడానికి మన దేశం చేస్తున్న ఎన్నో ప్రయత్నాల్లో ఇది కూడా ఎంతో కీలకమైనదిగా, ప్రపంచంలోనే ఇదొక వినూత్నమైన ఆవిష్కరణగా ఉండవచ్చని కూడా అందరూ భావిస్తున్నారు. ఇప్పుడు రెండోదశ కోవిడ్ దేశంలో మరణ మృదంగం మోగిస్తూ వీరవిహారం చేస్తున్న వేళ ఆ రాకాసిని నిరోధించడానికి డిఆర్‌డిఓ సంసిద్ధం కావడమే ఒక శుభ పరిణామం.

ఒకవైపు ఆక్సిజన్లు, మరోవైపు వ్యాక్సినేషన్ల కొరతగా ఉండడంతో కరోనా కోరల నుంచి బయటపడడానికి ఏ చిన్న ఉపకరణం లభిస్తుందని తెలిసినా మృత్యువుతో పోరాడుతున్న బాధితులు వాటికోసం ఎంతో ఆత్రుతగా ప్రాణాలుగ్గబట్టుకుని మరీ ఎదురుచూస్తున్నారు. అందుకే కొత్తగా రానున్న '2-డీజీ' మందు ఇప్పుడు దేశంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ మందు ఖచ్చితంగా ఓ గేమ్ ఛేంజర్‌గా భావించవచ్చని, కోవిడ్ బాధితులను ఆ వ్యాధి తీవ్రతనుంచి కాపాడుతుందని డిఆర్‌డిఓ ఛైర్మన్ డా. సతీష్‌రెడ్డి చెప్పడం బాధితులకు ఎంతో ఊరట కలిగిస్తోంది. ఏడాది క్రితం కరోనా ప్రారంభదశలోనే కోవిడ్ వైరస్‌పై యుద్ధం ప్రకటించిన డిఆర్‌డిఓ సంస్థ, ప్రధాని మోడీ సూచనలతో కరోనాకు విరుగుడు మందులను కనిపెట్టడానికి ఉపక్రమించింది. డిఆర్‌డిఓ శాస్త్రవేత్తల నిర్విరామ కృషి ఫలితంగా ఆ ప్రయత్నాలన్నీ ఫలించి కోవిడ్‌ను కట్టడిచేసే 2-డీజీ మందు ఇక.. త్వరలోనే ప్రజల ముందుకు రానుంది. వాస్తవానికి 'డిఆర్‌డిఓ' అంటే.. దేశ రక్షణకు అవసరమైన పరిశోధనలు చేసే సంస్థ అన్నమాట. దేశంలోని రక్షణ బలగాలకు తోడుగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత శక్తివంతమైన క్షిపణులను, దేశ రక్షణ వ్యవస్థకు అవసరమైన సరికొత్త ఆయుధాలను శరవేగంగా అందిస్తున్న సంస్థ ఇది. దేశం గర్వించదగిన సంస్థగా ఖ్యాతిగాంచిన ఈ సంస్థలో ఎందరో మెరికల్లాంటి గొప్ప శాస్త్రవేత్తలున్నారు. నిబద్ధతకు, విశేష ప్రజ్ఞాపాటవాలకు, అన్నిటికీ మించి అచంచల దేశభక్తికి ప్రతీకగా నిలిచిన విఖ్యాత శాస్త్రవేత్త గుండ్రా సతీష్‌రెడ్డి ఈ సంస్థకు సారధిగా ఉంటూ సంస్థను అజేయమైన రీతిలో ముందుకు నడిపిస్తున్నారు. ఆయన నేతృత్వంలో యుద్ధరంగంలోనే కాక, ప్రజాక్షేత్రంలో కూడా నిలిచి ఈ కరోనా రాకాసి నుంచి ప్రజల ప్రాణాలను రక్షించడానికి డిఆర్‌డిఓ సంస్థ తాజాగా 2-డీజీ(2 డియాక్సీ డి-గ్లూకోజ్) అనే అత్యద్భుత మైన ఔషధాన్ని కనిపెట్టింది. దాని వినియోగానికి డిసిజిఐ (డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా) వారి నుంచి అనుమతి కూడా వచ్చింది. ఈ మందుతో ఒకమోస్తరు నుంచి తీవ్రమైన కోవిడ్ లక్షణాలున్న వారికి ఇది దివ్యౌషధంలా సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు క్లినికల్ ట్రయల్స్‌లో వెల్లడి కావడం పట్ల సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది. కరోనా బాధితులు వేగంగా కోలుకోవడానికి ఈ ఔషధం బాగా పనిచేస్తుందని, అంతేకాక కృత్రిమంగా ఆక్సిజన్ ఇచ్చే అవసరాన్ని కూడా తగ్గిస్తుందని, ఈ మందు కోవిడ్ వైరస్ కణాలపై వేగంగా పనిచేయడం వల్ల బాధితులకు ప్రాణాపాయ స్థితి తప్పుతుందని కూడా డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు తెలియజేయడం ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ఈ విపత్కర పరిస్థితుల్లో ఇదో గొప్ప ఉపశమన వార్తేనని చెప్పవచ్చు. శరీరంలో వైరస్ బారిన పడిన కణాల్లోకి నేరుగా 2-డీజీ ఔషధం వెళ్లి వ్యాధిని నిరోధిస్తుందని, దీంతో శరీరంలో కరోనా వ్యాప్తి ఆగిపోతుందని, కోవిడ్ బాధితులకు ఇప్పుడు ఇస్తున్న చికిత్సలను అందిస్తూనే ఈ మందును కూడా అందిస్తే బాధితులు పది రోజుల్లోనే కోలుకునేవారు ఏడు రోజుల్లోనే కోలుకుంటారని డిఆర్‌డిఓ స్పష్టం చేస్తోంది.

పొడిలా ఉండే ఈ మందు చిన్న చిన్న పొట్లాలుగా ఉంటుందని, ఆ పొడిని బాధి తులకు నీళ్లలో కలిపి తాగించాలని, అలా ఉదయం సాయంత్రం రెండుపూటలా ఏడురోజులపాటు వాడితే దీంతో వైరస్ ఉన్న కణాల్లోకి నేరుగా ఆ మందు వెళ్లి వైరస్ వృద్ధిని అడ్డుకుంటుందని చెప్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌తో కలిసి పనిచేస్తూ ఈ మందును సాధ్యమైనంత త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు డిఆర్‌డిఓ కృషి చేస్తోంది. డిఆర్‌డిఓ అనుబంధ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ మెడిసిన్ అండ్ అలైడ్ సైన్సెస్ ఎన్నో పరిశోధనలు చేసి ఈ మందును అభివృద్ధి చేయడం విశేషం. కరోనా సోకిన బాధితులు త్వరగా కోలు కోవడానికి '2-డీజీ' బాగా ఉపకరిస్తుందని, అయితే, అసలు కోవిడ్ రాకుండా ఉండే దుకు వ్యాక్సినేషన్ (టీకా) ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తు న్నారు. ఇప్పటికే సతీష్‌రెడ్డి సారధ్యంలో డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు రేయింబవళ్లు శ్రమిస్తూ కరోనా బాధితులకు ఆసుపత్రులను ఏర్పాటు చేయడం, మందులు సరఫరా చేయడం, పిపిఇ కిట్లు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ వగైరాలన్నిటినీ తమ శక్తిమేరా అందిస్తుండడం, ప్రధాని తదితర నేతల సహకారంతో దేశానికి తనవంతు నిర్విరామ సేవలందిస్తూనే ఉండడం ఎంతైనా అభినందనీయం. అందులోనూ సతీష్‌రెడ్డి మన తెలుగువాడు కావడం.. ఈ పరిశోధనలు తెలుగుగడ్డ మీదనే జరగడం, ఇంకా చెప్పాలంటే ఆయన నెల్లూరుసీమ వరపుత్రుడు కావడం మరో విశేషం. ఏదేమైనా, డిఆర్‌డిఓ నుంచి వచ్చే '2-డీజీ' మందు బాగా పనిచేసి కోవిడ్ బాధితులను త్వరగా కోలుకునేలా చేయాలని, డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలతో పాటు దేశంలోని అందరు శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులందరి కృషితో త్వరలోనే పూర్తిస్థాయిలో కరోనా పీడ విరగడ కావాలని కోరుకుందాం!...

# ఆలయాల్లో ఏకాంత పూజలే మేలు

**- అర్చకులు**

రెండోదశ కరోనా విషపు కోరలు చాస్తూ తన ప్రతాపం చూపుతుండడంతో ఆ ప్రభావం అన్ని రంగాలపై పడింది. ఎవరూ బయటకు వెళ్ళేందుకు సాహసించడం లేదు. ఈ కరోనా రాకాసి నుంచి బతికించు దేవుడా అని దేవుడికి మొరపెట్టుకుందామనుకున్నా కరోనా నేపథ్యంలో ఆలయాల్లోపలకు వెళ్ళేందుకు భక్తులకు అనుమతి ఉండడం లేదు. దేవుడికి నిత్యం పూజలు సేవలు చేసే ఆలయాల్లో అర్చకులు కూడా ఆలయాలకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తే ఒకరినుంచి మరొకరికి కరోనా సోకుతుందేమోనన్న భయంతో ఆందోళన చెందు తున్నారు. అందువల్ల భక్తులు కూడా ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ కరోనా రాకుండా ఎవరికి వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరుకుంటున్నారు. కరోనా నేపథ్యంలో జిల్లాలోని అన్ని దేవాలయాల్లో ఆ భగవంతుడికి ఏకాంతంగా పూజలు నిర్వహించాలని జిల్లా అర్చక సమాఖ్య, పురోహిత సంఘం, బ్రాహ్మణ సంఘాల నాయకులు పీపీపీ ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు, ఫణికుమార్, శ్రీనివాసశర్మ, శ్రీధర్‌శర్మ, వాసుదేవరావు తదితరులు అభిప్రాయపడుతున్నారు. కరోనా విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో భక్తులను పూజల పేరుతో ఆలయాల్లోకి అనుమతించి కరోనా ప్రమాదాన్ని కొనితెచ్చుకోవద్దని, భగవంతునికి ఏ లోటూ లేకుండా ఏకాంతంగా పూజలు, సేవలు చేయడం ఉత్తమమార్గమని వారు అంటున్నారు. కరోనా తీవ్రత తగ్గేదాకా...కనీసం నెలరోజులపాటు ఇదేవిధంగా జాగ్రత్తలు పాటించాలని, ఈ విషయాన్ని జిల్లా దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొంటున్నారు.

# నీతోనే.. నేనూ

## భర్త మృతదేహం వద్ద విలపిస్తూ తనువు చాలించిన భార్య

ఆ భర్త అకస్మాత్తుగా కాలం చేయగా ఆయన లేని జీవితాన్ని ఊహించుకోలేని ఆ ఇల్లాలు భర్త మృతదేహం వద్ద రోది స్తూనే కుప్పకూలి తనువు చాలించింది. నాయుడుపేట పరిధిలోని బిరదవాడలో విశ్రాంత రైల్వే ఉద్యోగి పేర్నాటి వెంక టయ్య(75) ఈ నెల 9న అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబసభ్యులు వెంకటయ్య అంత్యక్రియల పనుల్లో నిమ గ్నమై ఉండగా ఆయన భార్య శేషమ్మ(65) మృతదేహం వద్ద రోదిస్తూ అపస్మారక స్థితి లోకి వెళ్లడంతో ఆమెను ఓ ప్రైవేటు ఆసు పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. తన అమ్మా, నాన్న ఇద్దరికీ కరోనా పరీక్షలు చేయించగా నెగెటివ్ రిపోర్టు కూడా వచ్చిందని, అయితే మరుసటిరోజే ఇలా జరిగిందంటూ కుమారుడు రాహుల్ పెద్దపెట్టున రోదిస్తున్నాడు.

**సవరణ :** 'లాయర్' మే 7వ తేదీ సంచిక మొదటి పేజీ వార్తల్లో తిరుపతి ఉప ఎన్నికకు సంబంధించి తెలుగుదేశం పార్టీకి గతంలోకంటే లక్ష ఓట్లు పెరిగా యని పొరపాటుగా ప్రచురితమైంది. లక్ష ఓట్లు తగ్గాయని సవరించి చదువుకో వాల్సిందిగా విజ్ఞప్తి. అక్షర దోషానికి చింతిస్తున్నాం. - సం/-

# ఒకే ఇంట్లో ముగ్గురు మృతి

ఏ ప్రాంతంలో చూసినా కరోనా మరణమృదంగం మోగిస్తూనే ఉంది. ఇటీవల కోవూరు పట్టణంలో వారం రోజుల్లోనే ఒకే ఇంట్లో ముగ్గురు కరోనా బారినపడి మృతి చెందడంతో కోవూరు ప్రజలు విషాదంలో మునిగిపోయారు. కోవూరులోని నందారావు కుటుంబానికి ఈ ఘోరం జరిగింది. వారి ఇంటిల్లిపాదికీ కోవిడ్ సోకగా నందారావు భార్య సీతారావమ్మ ఈనెల ఒకటో తేదీన మృతిచెందితే, 4వ తేదీన నందారావు మరణించారు. 6వ తేదీన వీరి కుమార్తె కూడా మరణించింది. ఆ కుటుంబంలో ఇక మిగిలివున్న కుమారుడి ఆరోగ్యం కూడా విషమించింది. ఎంత దారుణమో కదా!...

## కరోనా కట్టడికి...
# కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
### వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం వైఎస్ జగన్




కరోనా కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 11న ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆక్సిజన్ సరఫరా, వ్యాక్సినేషన్ కార్యక్రమం, ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం, వైఎస్సార్ రూరల్, అర్బన్ క్లినిక్కుల ఏర్పాటు, వైఎస్సార్ జలకళ, ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై సిఎం సమీక్ష నిర్వహించారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను తొందరగా పూర్తిచేయాలని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల ద్వారా పేదలకు పని కల్పించాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సిఎం వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ భాస్కర్ భూషణ్, జాయింట్ కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



**- ఎంపీ ఆదాల**

కోవిడ్ పట్ల ప్రజలు ఆందోళనకు గురై భయ పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండా లని నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు ఆదాల ప్రభా కర్‌రెడ్డి చెప్పారు. ఆ మహమ్మారి వ్యాధి నివారణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. కరోనా సెకండ్‌వేవ్ కారణంగా అనేక మంది ప్రజలు, ఆత్మీయులు, పార్టీ నాయకులు మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం కర్ఫ్యూ విధించిందని, ప్రజలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాధి నివారణకు రేయింబవళ్ళు కష్టపడుతున్న ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు ఆదాల ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# బోసిపోయిన కార్పొరేషన్

నెల్లూరు నగర కార్పొరేషన్ గత కొద్ది రోజులుగా జనం లేక కళతప్పింది. కరోనా కాటుతో కార్పొరేషన్‌లోని అనేక విభాగాలు వెలవెలబోతున్నాయి. పలువురు ఉద్యోగులకు కరోనా సోకడంతో వారంతా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ హోం ఐసోలేషన్‌లో ఉంటుండడంతో కార్పొరేషన్‌లో 50 శాతంపైగా ఉద్యోగులు విధులకు హాజరు కాలేని పరిస్థితి కనిపిస్తోంది. ఆ వచ్చేవారు కూడా బిక్కు బిక్కు మంటూ కార్పొరేషన్ కార్యాలయ గదుల్లో పనులు చేస్తున్నారు. మరోవైపు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా నామమాత్రంగానే ఉంది. ఏ సీట్లో ఎప్పుడు ఏ ఉద్యోగి పని చేస్తున్నారో పర్యవేక్షించే అధికారే కనిపించడం లేదు. కార్పొరేషన్ కార్యాలయంలో కొంతమంది ఉద్యోగులకు కరోనా సోకిందని వార్తలు రావడంతో నగర నలుమూలలనుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా చాలావరకు తగ్గిపోయారు. ప్రస్తుతం రోజుకు 20మందికి మించి కూడా జనం రావడంలేదు. ఇక రెవిన్యూ విభాగానికి చెందిన పలువురు ఆర్‌ఐలను నగరంలోని కోవిడ్ ఆసు పత్రుల్లో సూపర్‌వైజర్లుగా నియమించి ఉన్నారు. రెవిన్యూ, పారిశుద్ధ్య, అడ్మినిస్ట్రేటివ్ తదితర విభాగాలలో పలువురు ఉద్యోగులకు కరోనా సోకినట్లు తెలుస్తుండడంతో కార్పొరేషన్‌కు వచ్చేవారు భయపడిపోతున్నారు. దీంతో కార్పొరేషన్ కార్యాలయం అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు లేక బోసిపోయినట్లు కనిపిస్తోంది.

# ఆక్సిజన్ కొరత లేకుండా చూస్తాం
### - మంత్రులు గౌతమ్‌రెడ్డి, డా.అనిల్

జిల్లాలో కరోనా సోకి ఆక్సిజన్ లేక బాధపడుతున్న కోవిడ్ రోగులకు కొరత లేకుండా ఆక్సిజన్ అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, జలవనరుల మంత్రి డా.అనిల్ చెప్పారు. ఈనెల 13న నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వారు పాల్గొని జిల్లాలో కోవిడ్ విజృంభణ తీరు, దానిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. కరోనా తొలివిడత వ్యాధి లక్షణాలకు, మరణాలకు ఇప్పుడు రెండోవిడత వ్యాధి లక్షణాలకు ఎంతో తేడా ఉందని వారన్నారు. బాధితులకు చికిత్సలు అందించడానికి పడకల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి అవసరమైన ఆక్సిజన్ విషయమై ప్రధాని నరేంద్ర మోడీతో సీఎం వైఎస్ జగన్ మాట్లాడారని, ఆక్సిజన్ పంపిణీకి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు ఆస్పత్రులలో రోగులకు బెడ్స్ కేటాయించడంలో నిబంధనలు ఉల్లం ఘిస్తున్నారని మంత్రి డా.అనిల్ దృష్టికి తీసుకురాగా, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పి భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ కరోనా రెండో దశలో విధులు నిర్వహిస్తూ ఇప్పటికే ఏడుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారని అందువల్ల పోలీసులతో పాటు కరోనా నియంత్రణకు పాటుపడే ఫ్రంట్‌లైన్ వారియర్స్ అందరికీ మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



కోవిడ్ నుండి కోలుకుని సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రులు గౌతమ్‌రెడ్డి, అనిల్‌కుమార్


## అశ్రునివాళి



శ్రీ ఆళ్ళ గోపాలరెడ్డి గారు - శ్రీమతి పద్మావతమ్మ గారు
నిర్యాణం : 27.04.2021 నిర్యాణం : 05.05.2021

ఆప్యాయతకు, ప్రేమానురాగాలకు మారుపేరుగా నిలిచి,
మా అందరి హృదయాలలో సుస్థిరస్థానం పొందిన పుణ్యదంపతులు
మా అక్క, బావ
**శ్రీ ఆళ్ళ గోపాలరెడ్డి గారు - శ్రీమతి పద్మావతమ్మ గారు**
స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
*శోకతప్త హృదయాలతో అంజలి ఘటిస్తూ...*

సన్నపురెడ్డి జనార్ధనరెడ్డి (లేట్) - ఇందిరమ్మ
సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి - అనిత
సన్నపురెడ్డి మధుసూదనరెడ్డి - ఉమాభారతి
సన్నపురెడ్డి రవిప్రసాద్‌రెడ్డి - కవిత
మరియు కుటుంబసభ్యులు

## 'ప్రభా'తం

# మానవత్వం మంటగలిసిపోతోంది

దేశంలో ఒకవైపు కరోనా రాకాసి విలయతాండవం చేస్తోంటే, కొన్ని ప్రైవేటాసుపత్రులు, కార్పొరేట్ ఆసుపత్రుల వారు మాత్రం ఇదే సందని రోగుల నుంచి లక్షలు గుంజేస్తున్నారు. చివరికి ప్రాణవాయువుతోనూ, శవాలతో కూడా వ్యాపారం చేసేసుకుంటున్నారు. అయినా ఇంత ఘోరమా?.. ఇకనైనా ఈ తీరు మారాలి. మానవత్వాన్ని కూడా మంటగలిపేసే ఆ కర్కశత్వం ఇకనైనా పోవాలి. డబ్బే ప్రధానమనే గబ్బుతత్వం పోవాలి. మనిషి అన్నవాడెవడికైనా మానవత్వం ఉండాలి. సాటిమనిషి కష్టాల్లో ఉంటే ఆదుకునే గుణం ఉండాలి. మనిషి మనిషిగానే..మానవత్వంతో బతకాలి. అప్పుడే మనిషిజన్మకు సార్థకం.

'అమ్మా.. ఊపిరి ఆడడం లేదు.. నన్ను కాపాడమ్మా!' .. ఓ తల్లి ఆక్రందన.
'అయ్యో!.. నాకు మైకం కమ్మేస్తోంది. నా భార్యాబిడ్డలకు దిక్కెవరు?' ..ఓ తండ్రి రోదన.
'తల్లిదండ్రులిద్దరూ ముసలివాళ్ళయ్యా..!.. నన్ను రక్షించండయ్యా'!.. ఓ అన్న అభ్యర్థన.
'సార్!..ఎలాగైనా నన్ను బతికించండి. పసిబిడ్డల తల్లిని..' .. ఓ చెల్లి ఆవేదన.

ఎన్ని ఆక్రందనలు.. ఎన్ని ఆర్తనాదాలు.. ఎన్ని అభ్యర్థనలు, ఎన్నెన్ని కన్నీళ్ళు.. ఎన్నెన్ని దీనాతిదీనమైన వేడుకోళ్ళు. కరోనా రక్కసి కోరల్లో చిక్కి, దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు ప్రాణభయంతో విలవిల లాడుతున్న అత్యంత దయనీయ పరిస్థితిలో ఉన్న బాధితుల దీనాలాపనలు వింటుంటే, ప్రసార మాధ్యమాల్లో వారి ఆగని రోదనలు చూస్తుంటే మనిషన్న వాడికెవరికైనా సరే..గుండె చెరువైపోతుంది. కానీ, కరోనా రాకాసికన్నా భయంకరంగా జనాన్ని జలగల్లా పట్టి పీడిస్తున్న కొన్ని ప్రైవేటాసుపత్రులు, కార్పొరేట్ ఆసుపత్రుల వాళ్ళకి మాత్రం ఇలాంటి ఆర్తనాదాలేమీ వినిపించడం లేదు. కరోనా కాటుకు గురై మరణయాతనలతో వచ్చిన రోగుల నుంచి లక్షల రూపాయల డబ్బును లాగేసుకోవడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఒకవైపు దేశంలో అనేకమంది మానవత్వం గల వైద్యులు, అధికారులు, సిబ్బంది అంతా ఈ కరోనా కష్టకాలంలో దేవుళ్ళలా ముందు కొచ్చి.. ప్రజల ప్రాణాల కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి బాధితులను బతికించడానికి కంటికి కునుకులేకుండా అనునిత్యం శ్రమిస్తుంటే.. మరికొందరు ధనాశాపరులు మాత్రం ఎంతో పవిత్ర మైన వైద్యవృత్తినే పణంగా పెట్టి రోగుల్ని నిత్యం నిలువునా దోచుకుతింటున్నారు. దేశవ్యాప్తంగా అనేక ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇప్పుడు అనునిత్యం జరుగు తున్న తంతే ఇది. వాళ్ళకి డబ్బే ప్రధానమైపోయింది. వాళ్ళలో ధనతత్వం తప్ప మానవత్వం కనిపించడం లేదు. రోగుల గోడు పట్టించుకునేవారే లేరు. మానవత్వం అన్నది ఎప్పుడో మంటగలిసిపోయింది. రోగుల్ని బట్టి కాకుండా ఆసుపత్రుల్లో ఉండే రోజుల్ని బట్టి ఫీజుల గుంజాటన ప్రారంభిస్తారు. వేల నుంచి లక్షల దాకా ఉంటాయా ఫీజులు. గుండెలు బాదుకున్నా కనికరమన్నదే ఉండదు. డబ్బులివ్వకపోతే చూసేదేమీ ఉండదు..చేసేదేమీ ఉండదు..శవాన్ని మూటగట్టుకోవాల్సిందే. ఇదీ దుస్థితి. కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తే ఇక తిరిగొచ్చేది గ్యారంటీ ఉండకపోయినా, ఊపిరాడని విధిలేని పరిస్థితుల్లో అక్కడికి పరుగులు తీస్తున్న జనానికి..అసలైన కరోనా రాకాసి అక్కడ ఒక పెద్ద వైద్యభూతంలా వికటాట్టహాసం చేస్తూ ప్రత్యక్ష మవుతుంది. వైద్యపరీక్షలకైనా, చికిత్సలకైనా, ఇంజెక్షన్ వేయడానికైనా, ఆక్సిజన్ పెట్టడానికైనా, బెడ్ ఇవ్వడానికైనా, బ్లడ్ ఎక్కించడానికైనా.. దేనికైనా సరే ముందు నోట్లకట్టలు పెట్టాలి. ఆ డబ్బంతా ముందుగానే వాళ్ళ బ్యాంక్ అకౌంట్లలో జమ చేయాలి. డబ్బు పడినట్లు ఫోన్‌లో తెలిస్తేనే రోగికాడ పని మొదలవుతుంది. ఇదీ సంగతి. ఒకే బెడ్ మీద ఇద్దరు ముగ్గుర్ని కూడా పడేస్తారు. వారిలో ఒకరు శవమై ఉన్నా పట్టించుకోరు. ఆ బెడ్‌మీద బతికున్న బాధితులు ఎంత నరకం అనుభవిస్తున్నారో చూడండి. ఈ కర్కశత్వానికంతా పాల్పడేది మనవాళ్ళే కదా?.. 800 రూపాయల రెమిడెసివర్ ఇంజెక్షన్ 40 వేలకు బ్లాక్‌లో అమ్ముకునేదీ మనవాళ్ళే మరి!..రోగులకెంతో అవసరమైన 40వేలు చేసే ఒక ఇంజెక్షన్‌ను అక్షరాలా అయిదు లక్షల రూపాయలకు అమ్ముకునేది కూడా మనవాళ్ళే. అంతా మన భారతీయులే. ఎంత సిగ్గుచేటో కదా!..ఇంతటి ఘోరవిపత్తులో కూడా కార్పొరేట్ ఆసుపత్రుల అవినీతి అక్రమాలకు, ఆశకు అంతే ఉండడం లేదు. రోగి దొరికితే చాలు..లక్షలు దొరికినట్లే. ప్రతిరోజూ గుట్టలుగుట్టలుగా మందులు రాసేస్తారు. అన్నేసి మందులు అవి నిజంగా మింగడానికేనా?..మింగితే రోగి బతుకుతాడా?..అంతా ఉత్తిదే. అవి దొడ్డిదారి నుంచి మళ్ళీ వాళ్ళ మందులంగళ్ళకే చేరుతుంటాయని తెలియందెవరికి?..కరోనా కాటుతో ఊపిరాడక అవస్థలు పడే రోగులకు అత్యవసరమైన మందులు, ఇంజెక్షన్లు కూడా బ్లాక్‌మార్కెట్‌లో వేల నుంచి లక్షల రూపాయలకు అమ్మేసుకుంటుండడం అందరం చూస్తూ ఉన్నదే కదా!.. చివరికి రోగి జేబును కాదు..చొక్కానే కత్తిరించిపారేశాక..అప్పుడు చెప్తారు నిదానంగా..'జబ్బు ముదిరి రోగి చచ్చిపోయాడని'. ఇక్కడితో అయిపో లేదు. ఆసుపత్రికి వెళ్ళి చచ్చేదాకా తొలిదశ కరోనా అయితే, చచ్చిన తర్వాత శవాలతో వ్యాపారం రెండో దశ కరోనాగా కమ్ముకున్నట్లే. చివరికి శవాలతో కూడా వ్యాపారమే. శవాన్ని స్మశానం దాకా వాహనంలో తీసు కొస్తే ఎంత?..పెట్రోలు కెంత?.. డీజలుకెంత?.. కాలిస్తే ఎంత?.. పూడిస్తే ఎంత?.. అంతా వేలు, లక్షల్లోనే బేరాలు. ఆసుపత్రుల్లో ఆక్సిజన్ అందక ఎంతోమంది కాళ్ళుచేతులు గిలగిలా కొట్టుకుంటూ మృత్యువాత పడుతుండడం ఎంత దయనీయం?.. ఇదే సందని చివరికి ప్రాణవాయువు (ఆక్సిజన్) ధరను కూడా పెంచేసి లక్షల్లో వ్యాపారం చేసుకోవడం ఎంత ఘోరం?..మనలోనే ఇంత డబ్బు కక్కుర్తి ఉంటే ఇక ప్రభుత్వాలేం చేస్తాయి?..ఎవరు మాత్రం ఏం చేయగలరు?..ఇదంతా చూస్తుంటే..కరోనా మరో వేరియంట్ ఈ ధనపిశాచి రూపంలో మనిషిలోకి వచ్చిందేమో అనిపిస్తోంది. అయినా..ఇంత దౌర్భాగ్యం ప్రపంచంలో ఎక్కడా లేదు. ఇకనైనా ఈ తీరు మారాలి. ధనాశను మనసుల్లోంచి తరిమికొట్టాలి. మనిషి మనిషిగానే జీవించాలి. దయకు ప్రతిరూపంగా భరతమాత బిడ్డలుగా బతకాలి. అందులోనూ వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనది. వైద్యో నారాయణో 'హరి' అన్నారు మన పెద్దలు. ఇకనైనా వైద్యకేంద్రాలను దేవాలయాలుగా నిలుపుకోవాలి. ఆపదల్లో ఉన్నవాళ్ళని ఆదుకోవాలి. మనిషిలోని మానవతత్వమే మానవత్వం. అదే లేక పోతే.. మిగిలేదిక దానవత్వమే. అందుకే, కరోనా రాకాసి పోయినా పోకపోయినా సరే..మానవత్వం మాత్రం ఏనాటికీ మాసిపోకూడదు. మానవత్వం అనేది..ప్రతి మనిషిలో..ఈ జగతిలో ఎప్పటికీ పరిమళిస్తూనే ఉండాలి.

# వెంకటగిరిని కమ్మేస్తున్న.. కరోనా

## 647 కోవిడ్ కేసులు.. జనం బెంబేలు

వెంకటగిరిని కరోనా కమ్మేస్తోంది. ఎక్కడ చూసినా కరోనాయే. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు కరోనాతో కకావికలంగా ఉన్నాయి. ఇప్పటికే ఒక్క వెంకటగిరి మునిసిపాలిటీ పరిధిలోనే 647కి పైగానే కోవిడ్ కేసులు నమోదు కావడంతో వెంకటగిరి అట్టుడికిపోతోంది.

దీంతో మునిసిపల్ అధికారులు కరోనా కట్టడికి మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వీధులను శుభ్రం చేయిస్తూ, హైపోక్లోరైడ్‌ను స్ప్రే చేయిస్తూ, ప్రజలు కరోనా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు. కరోనా బాధితులకు సత్వర చికిత్సలు అందించేందుకు వెంకటగిరిలో రెండు కోవిడ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో కోవిడ్ కేసులు అత్యధికంగా ఉన్నాయి. ఇక్కడే సుమారు నూటపాతిక పైగానే కోవిడ్ కేసులున్నట్లు తెలుస్తోంది. బాలాయపల్లితో పాటు వెంకటగిరి నియోజకవర్గం పరిధిలోని డక్కిలి, సైదాపురం మండ లాల్లోనూ కరోనా విజృంభిస్తోంది. దీంతో ఉన్నతాధికారులు, వైద్యాధికారులు పదేపదే ఈ ప్రాంతాలను సందర్శించి కరోనాతో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు సూచిస్తున్నారు. కరోనా లక్షణాలున్నా, కోవిడ్ వైరస్ సోకినట్లు అనుమానం వచ్చినా ఆందోళనకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలని, వెంటనే ఆరోగ్యపరీక్షలు చేయించుకుని సత్వర చికిత్సలు చేయించుకోవాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. వ్యాధి తీవ్రత లేనివారు హోం క్వారంటైన్‌లో ఉన్నా తగు జాగ్రత్తలు తీసుకుంటూ వైద్య చికిత్సలు చేయించుకోవాలని, ప్రభుత్వం వారికి అవసరమైన మందులను ఉచితంగానే అందజేస్తోందని అధికారులు చెప్తు న్నారు. కోవిడ్ వైరస్ సోకిన వారికి తక్షణం చికిత్సలు చేయిం చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వెంకటగిరిలో లాక్‌డౌన్ ప్రకటించి ఉన్నందున ప్రజలు, దుకాణాదారులు అందరూ నిబంధనలు పాటించాలని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, భౌతికదూరం పాటించాలని, కోవిడ్ నిబంధనలను పాటిస్తూ అందరూ కరోనాకు దూరంగా ఉండాలని అధికారులు, వైద్యబృందాలవారు పదేపదే హెచ్చరిస్తున్నారు.

### మునిసిపల్ సిబ్బందికి

## 'సంయుక్త' మాస్కుల వితరణ

కావలిలోని సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలోని మునిసిపల్ సిబ్బందికి, పారిశుద్ధ్య సిబ్బందికి ఎన్-95 మాస్కులను పంపిణీ చేసి తమ సేవాభావం చాటుకున్నారు. మునిసిపల్ కమిషనర్ శివారెడ్డి, డిఇ శ్రీనివాసులు చేతుల మీదుగా వాటిని సిబ్బందికి అందజేశారు. ఆటో డ్రైవర్‌గా ఉంటూ సురేంద్ర మానవతా దృక్పథంతో ఇలాంటి సేవలు చేస్తుండడం పట్ల ఆయన్ను అందరూ అభినందించారు.

## అల్లూరు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ శీనయ్య మృతి



అల్లూరు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇగా పనిచేస్తున్న బి.శీనయ్య కరోనాతో మృత్యువాత పడ్డారు. కొద్దిరోజుల కిందటనే ఆయన కరోనా వ్యాధితో అల్లూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. అక్కడనుంచి మెరుగైన చికిత్స కోసం కావలి కందుకూరి ఆసుపత్రిలో చేరి చికిత్సపొందుతూ ఇటీవల ఆయన మృతిచెందడంతో ఆ శాఖ అధికారులు సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. ఇఇపిఆర్‌డి మురళీకృష్ణ, కార్యదర్శి నీరజ, నగర పంచాయతీ సిబ్బంది, ఏంపిడిఓ కార్యాలయ సిబ్బంది అందరూ ఆయన మృతికి బాధను వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి తమ సంతాపం తెలిపారు.

# అడవుల్లో అగ్నిని చల్లార్చండి

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ఈ మండు వేసవిలో జిల్లాలోని అడవులకు అగ్ని నుంచి ప్రమాదం జరగకుండా అధి కారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే గత రెండు మూడు రోజులుగా ఉదయగిరి దుర్గంపై ఉన్న కొండకోనల్లో పచ్చనిచెట్లు కూడా అగ్నికి తగులబడిపోతున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఎవరైనా ఆకతాయిలు అడవిలో నిప్పు పెట్టి ఉంటారేమోనని అందరిలోనూ సందేహం కలుగుతోంది. దుర్గం పైనున్న కొండ ప్రాంతాలకు వెళ్ళడమంటే సామాన్యులకు ఎంతో కష్టం.

ఆ దారులన్నీ బాగా తెలిసినవారే ఎవరో ఇలా అడవికి నిప్పు పెట్టి ఉండవచ్చేమో!.. ఎండాకాలంలో చెట్లు బాగా ఎండిపోయి ఉంటాయని, అవి కాలిపోయి మళ్ళీ చిగురిస్తే పశువులకు పచ్చి మేత దొరుకుతుందనే అజ్ఞానంతో కొంతమంది ఇలా చేస్తుంటారని కూడా అంటున్నారు. ఎవరో కొద్దిమంది మూర్ఖత్వం వల్ల అడవుల్లోని పచ్చని చెట్లన్నీ కూడా తగలబడిపోతుండడం ఎంతైనా బాధాకరం. ఈ మంటలకు పక్షులు, జంతువులు, వన్యప్రాణులు ఎంతగా విలవిలలాడుతాయో!.. ఇకనైనా అడవుల్లోకి ఇతరులెవరూ వెళ్ళకుండా గట్టి నిషేధం విధించాలి. అడవుల్లోకి ఉన్న దారులన్నిటినీ కట్టుదిట్టం చేసి సిసి కెమెరాల నిఘా ఏర్పాటుచేయాలి. ఎక్కడా అగ్నికి తావు లేకుండా చూడాలి. అడవులను సంరక్షించుకునేందుకు సహకరించాలని, అడవులకు నిప్పు పెట్టడం పెద్ద నేరమని అటవీ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు తెలియజెప్పాలి. పచ్చదనం, పర్యావరణం నాశనమైతే చివరికి మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుంది. అటవీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఇలాంటి ఘటనలపై స్పందించాలి.

– ఎస్ సుమలత, ఉదయగిరి.

# తోపుడు బండ్ల బ్రతుకులు వీధి పాలేనా?

కరోనా రెండో దశ కష్టాలతో వీధి వ్యాపారులుగా జీవనం సాగించే అనేకమందిమి జిల్లా వ్యాప్తంగా ఎన్నో రకాలుగా అవస్థలు పడుతున్నాము. కరోనా దెబ్బకి భయపడి వీధుల్లోకి వెళ్లాలంటే భయమేస్తోంది. తోపుడు బండ్లు నెట్టుకుంటూ జీవనోపాధి పొందే మేము ఇంక ఎలా బ్రతకాలో అర్థం కావడం లేదు. మళ్ళీ లాక్‌డౌన్, కర్ఫ్యూ నిబంధనలతో మాకు మరింత కష్టాలు ఎదురవుతున్నాయి. అసలే పేదవాళ్ళం, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. ఇలాంటి కష్ట సమయంలో ప్రభుత్వం మానవతా దృక్పధంతో మా కష్టాల్ని పరిశీలించి మా బ్రతుకు బండ్లు సాఫీగా నడిచేలా తగు సాయం చేస్తారని కోరుకుంటున్నాం.

– ఆర్.మధు, పొదలకూరు.

# ఓటిటి ప్లాట్‌ఫామ్‌లో హిట్ కొట్టిన
## మన నెల్లూరీయుల సినిమా
# 'థ్యాంక్ యు బ్రదర్'




**దేశమంతా అన్ని రాష్ట్రాలూ ఒక్కొక్కటిగా రెండవ దశ లాక్‌డౌన్ విధిస్తున్నాయి. ఈ తరుణంలో ప్రపంచ వ్యాప్తంగా ఓటిటి (ఓవర్ ది టాప్) ప్లాట్‌ఫామ్ 'ఆహా'లో విడుదలైన మన నెల్లూరీయుల సినిమా 'థ్యాంక్ యు బ్రదర్' సంచలనం సృష్టిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న తెలుగువారితో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సినిమా ప్రియులను ఈ సినిమా ఆకట్టుకుంటోంది.**

2020లో విధించిన లాక్‌డౌన్ నేపథ్యంగా ఈ చిత్రం రూపొందింది. చిన్నతనంలోనే తండ్రికి దూరమై చెడు వ్యసనాలకు బానిసగా మారిన కొడుకుని చూసి ఒక తల్లి పడే బాధ... తాను గర్భవతిగా ఉన్న తరుణంలోనే ప్రమాదంలో భర్తను కోల్పోయి, బిడ్డకు జన్మనివ్వడం కోసం మరో తల్లి అనుభవించే వ్యథ, ఈ రెండు సంఘటనలను ఆధారం చేసుకుని రూపొందించిన కథే ఈ చిత్రం.

చిన్నతనంలోనే తండ్రికి దూరమై తల్లి అతి గారాబంతో పూర్తిగా చెడిపోయి ఉంటాడు హీరో అభి(విరాజ్ అశ్విన్). కొడుకుని అదుపులో పెట్టే క్రమంలో అతని పాకెట్ మనీ కట్ చేయడమే కాకుండా, కార్డులు మొత్తం బ్లాక్ చేయిస్తుంది తల్లి. 'నిన్ను కనడానికి పడ్డ పురిటి నెప్పులు బాధ ఇప్పటికీ అనుభవిస్తున్నాను రా' అంటూ తన ఆవేదన వ్యక్త పరుస్తుంది. తల్లి సంరక్షణ నుండి బయటకు రాగానే తన మిత్రులు సైతం తనను కలవడానికి అయిష్టత చూపిస్తారు. అహంభావ స్వభావం వున్న అభి వ్యవహారశైలి వారిచేత ఆలా చేయిస్తుంది. అభి ఉద్యోగ వేటలో పడతాడు. అదే క్రమంలో తన తండ్రి భాగస్వామి ఇంటి అపార్ట్‌మెంట్‌కి వెళ్తాడు. ఇది కథలో ఒక భాగం.

కట్ చేస్తే... ప్రియ(అనసూయ) మధ్యతరగతి గృహిణి. తాను గర్భవతి అయిన కొన్ని రోజులకే తన భర్త ప్రమాదంలో మరణించడంతో, తన అత్తయ్యతో కలసి వుంటుంది. ఆమె తన డాక్టర్ని కలవడం కోసం ఇదే అపార్టుమెంటుకి వస్తుంది. ఒక ఫ్లోరు నుండి అభి, మరో ఫ్లోర్ నుండి అనసూయ ఇద్దరూ అదే అపార్టుమెంటులో తమ పని ముగించుకుని తిరిగి వస్తున్న తరుణంలో వారిద్దరే వున్న లిఫ్ట్ సాంకేతిక కారణంతో ఆగిపోతుంది. ఒక్కసారిగా పై ఫ్లోర్ నుండి క్రింది ఫ్లోరుకి జారిపోతుంది.

ఇక్కడి నుండి కథ మొత్తాన్ని భావోద్వేగంతో ముందుకు నడిపిస్తాడు దర్శకుడు. లాక్‌డౌన్ కావడంతో లిఫ్ట్ మెకానిక్ రావడానికి ఆలస్యం కావడం, ఫోన్ ద్వారా డాక్టర్ సూచనలతో అభియే ప్రియకు లిఫ్ట్‌లో డెలివరీ చేయడంతో కథ సుఖాంతం అవుతుంది.

ఇక్కడ లిఫ్ట్ ఆగిపోవడాన్ని చక్కగా వాడుకుని హీరో అభికి పురిటి నెప్పులు బాధను చూపించడంలో దర్శకుడు తన ప్రతిభను కనపరిచాడు. ఈరోజుల్లో లిఫ్ట్ ఆగిపోవడం అనే గోరంత అంశాన్ని కొండంతగా చూపించినా, లిఫ్ట్‌లో పురిటి నొప్పులతో అనసూయ అనుభవించే బాధని భావోద్వేగ పూరితంగా చిత్రీకరించాడు దర్శకుడు. చిత్రం ద్వితీయార్ధం మొత్తం సెంటిమెంటుతో కూడి ఉత్కంఠ భరితంగా సాగుతుంది. కేవలం గంటన్నర నిడివి కలిగిన ఈ సినిమా ఒక రకంగా మంచి సాహసమే అని చెప్పాలి. ఒకే ఒక పాట, అనసూయకి మినహా హీరోయిన్‌కి పెద్దగా ప్రాధాన్యత లేని కథతో పాటు, అన్నపూర్ణమ్మ, కాదంబరి కిరణ్, వివా హర్ష తప్ప తెలుగు తెరకు బాగా పరిచయమున్న ముఖాలు కూడా పెద్దగా లేవు. ఎవరో కూడా తెలియని ఒక అపరిచితుడు చేత అనసూయకి లిఫ్ట్‌లో ప్రసవం చేయించడం దర్శకుడి ధైర్యానికి నిదర్శనం. చివరగా ఆమె చేత 'థ్యాంక్ యు బ్రదర్' అని చెప్పించి అక్కడ సెంటిమెంటుని బాలన్స్ చేశాడు.

లిఫ్ట్‌లో అనసూయ పురిటి నెప్పులు పడుతున్నప్పుడు ఆందోళన పడే హీరోకి ఆ పురిటి వేదన ఏమిటో ప్రత్యక్షంగా కనిపిస్తుంది. తన పురిటి నెప్పుల బాధ ఇప్పటికీ తనతో పడుతున్నానని తన తల్లి అన్న మాటలలోని అంతరార్థం అభికి అర్థమయ్యేలా చూపించాలన్నదే దర్శకుడు రమేష్ రాపాటి ఆలోచన. అది సఫలమయ్యింది. గుణా బాలసుబ్రహ్మణియన్ సంగీతం ఈ సినిమాకి మరో ఆకర్షణ. మే 7వ తేదీ ఆహా ఓటిటిలో విడుదలైన 'థ్యాంక్ యు బ్రదర్'ని, 3 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 20 లక్షలమందికి పైగా చూసి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

నెల్లూరీయులకు సుపరిచితుడు మాగుంట వెంకటనారాయణరెడ్డి సమర్పణలో ఆయన కుమారుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి, అల్లుడు బొమ్మిరెడ్డి తారక్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. చాలా రోజులకి తెలుగు సినీ పరిశ్రమలో మళ్ళీ ఒక మంచి సినిమాని అందించిన మన నెల్లూరీయులకు 'లాయర్' అభినందనలు.




# కాకాణికి మాగుంట శీనయ్య పరామర్శ



సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పలువురు నాయకులు ఇటీవల ఆయన నివాసంలో కలసి పరామర్శించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి రమణారెడ్డి ఇటీవల కాలధర్మం చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాకాణి తమ పుట్టిన ఊరైన తోడేరులోనే ఉంటున్నారు. దీంతో ఈ నెల 11వ తేదీ ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తోడేరుకు వెళ్ళి కాకాణిని పరామర్శించి వారి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలిపాడు.



## ప్రసన్న ఓదార్పు

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈ నెల 10న తోడేరుకు వెళ్లి తండ్రి మృతితో బాధపడుతున్న కాకాణిని ఓదార్చారు. డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ వీరి చలపతిరావు, డీఏఏబీ ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించి, ఆయనకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# భగవాన్ మహావీర్ జైన్ ట్రస్ట్ దాతృత్వం

## క్యాన్సర్ ఆసుపత్రికి 5.50 లక్షల వితరణ



నెల్లూరులోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రికి నగరంలోని భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ వారు తమ మానవీయసేవల్లో భాగంగా అయిదున్నర లక్షల రూపాయలను వితరణగా అందజేసి తమ దాతృత్వం చాటుకున్నారు. నెల్లూరు పొదలకూరు రోడ్డులో ఉన్న కేన్సర్ ఆస్పత్రిలోని సర్జికల్ జనరల్ వార్డులను శీతలీకరించేందుకు వారు ఈ భూరి విరాళం అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.మోహన్‌లాల్ జైన్ రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్‌కు ఈనెల 10వ తేదీన ఆ నగదును చెక్కు రూపంలో అందజేశారు. ఇప్పటికే పలుసార్లు మహావీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్టు వారు ఆసుపత్రికి విరాళాలు అందచేసి ఉన్నారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవన్మల్ పి.జైన్, చంపాలాల్ జైన్, మిశ్రిమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల డాక్టర్..

# సుజాత కరోనాతో కన్నుమూత



ఎన్నో ఏళ్ళుగా జిల్లాలోని పోలీసు అధికారులకు, పోలీసు సిబ్బందికి, పోలీసు కుటుంబాల వారికి ఎంతో నిబద్ధతతో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ పసుపులేటి సుజాతను కరోనా పొట్టన పెట్టుకుంది. గత కొద్దిరోజులుగా ఆమె కరోనాతో పోరాడుతూ ఈనెల 9న మృతిచెందడం ఎంతో బాధాకరం. ఎంతో ఆత్మీయతతో, ఎప్పుడూ చిరునవ్వుతో అందరికీ వైద్యసేవలందించే డాక్టర్ సుజాత మరణించారనే సమాచారం అందరినీ కంటతడిపెట్టించింది. పోలీసు అధికారులతో సహా, పోలీసుల కుటుంబాల వారంతా ఆమె మృతిని జీర్ణించుకోలేకపోతున్నారు. నెల్లూరు పోలీస్ వెల్ఫేర్ క్లినిక్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ సుజాత గత నాలుగేళ్ళుగా విధులు నిర్వహిస్తున్నారు. అంతకుముందు ఆమె చిత్తూరు జిల్లా మెడికల్ ఆఫీసర్‌గా కూడా పనిచేశారు. డెప్యుటేషన్‌పై జిల్లాకు వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు. పోలీసులకు వైద్యసేవలందించడమే కాక, కరోనా పట్ల వారంతా అప్రమత్తంగా ఉండేవిధంగా ఎప్పటికప్పుడు వారిని హెచ్చరిస్తూ ఉండే డాక్టర్ సుజాత మృతిచెందడంతో వారెంతో బాధపడుతున్నారు.


## శ్రద్ధాంజలి



### మనుబోలు ప్రభాకర్‌రావు

జననం : 01.08.1954 నిర్యాణం : 05.05.2021

పాత్రికేయుడిగా, నటుడిగా, గాయకుడిగా,
సాహిత్య, సాంస్కృతిక, సంగీత రంగాలలో
తన ప్రతిభను చాటుకున్న సౌమ్యశీలి
మా మనుబోలు ప్రభాకర్‌రావు గారి
ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

- మిత్రులు మరియు ఆప్తులు


## నెల్లూరు కబుర్లు

# కరోనాతో జాగ్రత్త!..

## రాబోయే రెండు నెలలు అత్యంత కీలకం

### - పోలీసు సిబ్బందిని హెచ్చరించిన ఎస్పీ భాస్కర్‌భూషణ్




కరోనా వేగంగా విస్తరిస్తున్న నేపధ్యంలో పోలీసు సిబ్బంది.. జాగ్రత్తగా ఉంటూ విధులు నిర్వహించాలని, ఇంకా కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకోని సిబ్బంది అంతా వెంటనే టీకా వేయించుకోవాలని ఎస్పీ భాస్కర్ భూషణ్ సూచించారు. ఈనెల 10న ఆయన జిల్లాలో వివిధ విభాగాల్లో డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే రెండు నెలలు అత్యంత కీలకమైనవని, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని విభాగాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులతో కలిపి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏవైనా సమస్యలుంటే అందులో తెలియచేస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ సిబ్బందిలో ఎవరైనా కోవిడ్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు తెలిస్తే వెంటనే పరీక్షలు నిర్వహించి అస్పత్రుల్లో చేర్పించాలన్నారు. సిబ్బంది అందరూ ఖచ్చితంగా మాస్కులు, ఫేస్ షీల్డ్ వంటి అద్దాలు ధరించాలన్నారు. అవసరమైన సురక్షిత ఉపకరణాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే మాత్రలు తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లలో భౌతికదూరం పాటిస్తూ ఫిర్యాదులు స్వీకరించాలని, అత్యవసరమైతేనే స్టేషన్‌లోకి అనుమతించాలన్నారు. కరోనా బారిన పడిన సిబ్బందితో తరచూ మాట్లాడుతూ వారిలో మనోధైర్యాన్ని నింపాలన్నారు. అనంతరం ఆయన కరోనా బారినపడి ఆస్పత్రులు, హోమ్ ఐసోలేషన్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. తొలుత కరోనా మొదటి దశ నుంచి పోలీసుశాఖ వెన్నంటే ఉంటూ ఎంతో తోడ్పాటు అందించి, ఎంతోమందికి వైద్య సేవలందించిన పోలీసు డాక్టర్ సుజాత మరణం చాలా బాధాకరమని అంటూ ఆమెకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పి.వెంకటరత్నం, ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీలక్ష్మి, ఏఆర్ ఎఎస్పీ వీరభద్రుడు, డీఎస్పీలు శ్రీనివాసరావు, హోమ్‌గార్డ్స్ ఆర్ఐ పాల్‌రాజు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### హోమ్ ఐసోలేషన్ బాధితుల కోసం

## కాల్‌సెంటర్



జిల్లాలో హోమ్ ఐసోలేషన్లో ఉంటూ చికిత్స పొందుతున్న కరోనా బాధితులకు కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 24 మంది సిబ్బంది 24 గంటలూ బాధితుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటూ ఉంటారని, 104, 1077 కాల్ సెంటర్లు, వైద్య ఆరోగ్యశాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన వారికి చికిత్స అందేలా చూస్తారని ఆయన పేర్కొన్నారు. మండలాల్లో 6,962 మంది, మునిసిపాలిటీల్లో 9,038 మంది హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 46 మండలాలు, 8 పురపాలక సంఘాల్లో హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నవారికి మెడికల్ కిట్లు సరఫరా చేస్తామన్నారు. ఏఎన్ఎంలు, వాలంటీర్ల సహకారంతో బాధితులందరికీ వైద్యసేవలు అందిస్తామన్నారు. అవసరమైనవారు 7207337780, 7207337781, 7207337782, 7036747605, 7036747608నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

# ఐసిడిఎస్ పి.డిగా రోజ్‌మాండ్

స్త్రీ శిశు సంక్షేమాభివృద్ధి సంస్థ (ఐసిడిఎస్) ప్రాజెక్టు డైరెక్టర్‌గా కె.ఎం.రోజ్‌మాండ్ ఇటీవల నెల్లూరులోని పి.డి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె డిఆర్‌డిఏ ఇన్‌చార్జి పి.డిగా, పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌గా పనిచేశారు. సెంట్రల్ ఇన్‌చార్జి సిఇఓగా పనిచేస్తుండగా ఐసిడిఎస్‌కు రెగ్యులర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ శిశు సంక్షేమానికి సంబంధించిన పథకాలన్నీ సంపూర్ణంగా అమలయ్యేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. రెగ్యులర్ పి.డిగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఐసిడిఎస్‌లోని పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఐసిడిఎస్ ఏ.పి.డి ఉమాదేవి, సిడిపిఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### కరోనా మృతులకు..

# రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



కరోనా మహమ్మారి వ్యాధితో ప్రాణాలు కోల్పోయిన వారి అంత్యక్రియలను రెడ్‌క్రాస్ వలంటీర్లు నెల్లూరులోని బోడిగాడితోట శ్మశానంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఈనెల 10న బోడిగాడితోటకు వచ్చి అంత్యక్రియల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వలంటీర్లకు వివరించారు. కరోనాతో మరణించినవారికి అంత్యక్రియలు చేసేందుకు రోగుల బంధుమిత్రులు ముందుకు రాని సందర్భాల్లో మృతిచెందిన వారి గౌరవాన్ని కాపాడే విధంగా ఈ కార్యక్రమాన్ని తాము సేవా దృక్పథంతో చేపట్టామని తెలిపారు. రెడ్‌క్రాస్ ప్రకృతి విపత్తుల శాఖ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్, కలువాయి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ పుల్లయ్య పాల్గొన్నారు.

# ఇదేనా కరోనా నియంత్రణ?..

### - టిడిపి నేత ఆనం వెంకటరమణారెడ్డి ధ్వజం



రాష్ట్రంలో కరోనాను నియంత్రించేస్తున్నామంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్, రాష్ట్ర ప్రభుత్వం పదేపదే ప్రకటించుకుంటున్నారే తప్ప ఆచరణలో కరోనా నియంత్రణలో లేదని, కరోనాను నిరోధించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి రాష్ట్ర అధికారప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 9న ఆయన నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బాధితులకు ఆక్సిజన్ కొరత లేదని, పడకలు ఖాళీగానే ఉన్నాయని, బాధితుల సంఖ్య స్వల్పమేనంటూ అవాస్తవాలు చెప్తున్నారని, ఇదేనా నియంత్రణ అని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రభుత్వానికి తప్ప అందరికీ సలహాలిస్తుంటారని, కరోనాపై చంద్రబాబునాయుడు సలహాలిస్తే మాత్రం అక్రమ కేసులు బనాయిస్తుంటారని, ఇదేం పద్ధతని ఆయన ఎద్దేవా చేశారు.

# ఘనంగా రాణాప్రతాప్ జయంతి

మహావీరుడు..దేశభక్తుడు మహా రాణా ప్రతాప్‌సింగ్ 481వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 9న భారతీయ జనతా యువమోర్చా నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నగరంలోని సంతపేటలో జరిగిన కార్యక్రమంలో రాణాప్రతాప్ చిత్రానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్, నాయకులు కమలేష్, మల్లికార్జున, సునీల్, మధు, నవీన్‌సింగ్ పాల్గొన్నారు.

# ఒంటరి పిల్లల సంరక్షణకు.. ప్రత్యేక కేంద్రాలు

తల్లిదండ్రులు కరోనా బారినపడి ఆసుపత్రుల్లో ఉంటున్న సమయంలో, ఇంట్లో ఒంటరిగా ఉంటున్న బాలల సంరక్షణకు ప్రత్యేకంగా రెండు బాలల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోజ్‌మాండ్ చెప్పారు. నెల్లూరు రూరల్‌లోని ఆమంచర్లలోను, నెల్లూరు పొదలకూరురోడ్డులోను బాల, బాలికలకు వేర్వేరుగా సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ చిన్నారుల తల్లిదండ్రులు కోలుకుని ఇంటికి వచ్చిన తర్వాత వారికి తిరిగి అప్పగించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లలోపు బాల బాలికల సంరక్షణ కోసం ఛైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబరు 1098, 181కు సమాచారం అందించాలని ఆమె కోరారు.

# సీనియర్ నేత.. కాకాణి రమణారెడ్డి కన్నుమూత



- శోకసాగరంలో కుటుంబసభ్యులు
- విషాదంలో జిల్లా రాజకీయ రంగం

**జిల్లాలో దాదాపు ఆరు దశాబ్దాల పాటు రాజకీయాలు సాగించి, జిల్లాలో 'పెద్దాయన'గా అందరూ గౌరవించే ఉన్నతస్థాయికి ఎదిగి, రాజకీయరంగంలో అస్తవ్యస్త విధానాలకు తావులేకుండా విలువలతో కూడిన రాజకీయాలు నెరపి, ఆదర్శభావాలు గల నాయకునిగా ఆదర్శనేతగా అటు నాయకుల్లోనూ, ఇటు ప్రజల మనసుల్లోనూ స్థానం సంపాదించుకున్న సీనియర్ నాయకుడు..మానవీయ నేత కాకాణి రమణారెడ్డి..ఇక లేరు!..**

90 ఏళ్ళ వృద్ధాప్యంలో కాకాణి రమణారెడ్డి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఈనెల 7న ఆయన అస్తమించారు. తండ్రి మృతితో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పొదలకూరు మండల ప్రజలే కాక జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు, సహచరులంతా శోక సాగరంలో మునిగిపోయారు.

## విలువలకు ప్రాధాన్యతనిచ్చిన నాయకుడు

కాకాణి రమణారెడ్డి.. పాతతరం నాయకుడు. నీతి నిజాయితీలకు, నైతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చే వ్యక్తి. జిల్లాలోని సీనియర్ రాజకీయనాయకుల్లో ఆయన ముఖ్యులు. ప్రజాసేవే జీవిత ధ్యేయంగా రాజకీయరంగంలోకి వచ్చి, ప్రజల సమస్యల పరిష్కారానికే జీవితాన్నంతా వెచ్చించిన నాయకులాయన. తనను నమ్ముకున్న ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో తోడునీడగా ఉంటూ ప్రజాసేవలో ఏళ్ళతరబడి తరించిన నాయకుడు కాకాణి రమణారెడ్డి. పొదలకూరు మండలంలోని తోడేరు గ్రామం నుంచి ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైనా, పొదలకూరు మండలంలోనూ ఆ తర్వాత జిల్లా రాజకీయరంగంలోనూ ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. ప్రధానంగా ఆనం కుటుంబంతో ఆయనెంతో సన్నిహితంగా ఉండేవారు. అప్పట్లో ఏసి సుబ్బారెడ్డికి ప్రియశిష్యుడిగా కూడా ఉన్నారు. జిల్లా రాజకీయాల్లో రాటుదేలిన యోధునిగా, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే నేతగా ఆయనకు పేరు. ముఖ్యంగా రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యతనిచ్చిన నాయకుడాయన. తన 22 ఏళ్ళ వయసులోనే తోడేరు పంచాయతీకి సర్పంచ్‌గా నిలిచి గెలిచి అందరి దృష్టినీ ఆకర్షించాడు. స్వయం కృషితో, పట్టుదలతో రాజకీయాల్లో రాణించాడు. 1959లో సమితి అధ్యక్షుడిగా ఎన్నికై 1977 దాకా అంటే దాదాపు 18 ఏళ్ళ సుదీర్ఘకాలంలో ఆయన మండల ప్రజలకు, జిల్లా ప్రజానీకానికి తనవంతు సేవలందించి సింహపురిసీమకే గర్వకారణంగా నిలిచాడు. పొదలకూరు సమితి అధ్యక్షునిగా 18 ఏళ్ళ పాటు అధ్యక్షునిగా ఉంటూ అప్పట్లో ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ల్యాండ్‌సీలింగ్‌లో ముందుగా ఆయన తన 50 ఎకరాల మెట్ట భూములను, మరో 10 ఎకరాల మాగాణి భూమిని ప్రభుత్వానికి అప్పగించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఆయన హయాంలో వేలాదిమంది ప్రజలకు ఉద్యోగాలిచ్చి, ఎంతోమంది పేదలకు ఉపాధి చూపి ప్రజల మనసుల్లో నిలిచిపోయాడు. తోడేరు గ్రామస్తులే కాక జిల్లా ప్రజలు కూడా ఆయన్ను ఎంతగానో అభిమానించేవారు. 'పెద్దాయన' అంటూ ఆయన్ను ఆత్మీయంగా పిలుచుకునేవారు. పిలిస్తే పలికే నాయకునిగా, ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తిగా ప్రఖ్యాతి చెందిన ఆయన ప్రజల కష్టాల్లో పాలు పంచుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు. వృద్ధాప్యంలో కూడా ఆయన అలుపెరుగకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం, నిరుపేదల అభ్యున్నతి కోసం తనవంతు కృషి చేశారు. ఏదేమైనా జిల్లాలోని పాత తరం నాయకుల్లో అత్యంత ముఖ్యులైన నేత..సహృదయుడు, ప్రజాసేవాభిలాషి..కాకాణి రమణారెడ్డి మరణంతో జిల్లాలో విషాదం అలముకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే..ఆయన మృతితో జిల్లా రాజకీయంగా ఒక పెద్ద దిక్కుని కోల్పోయినట్లయింది.

## ప్రముఖ నాయకుల సంతాపం

కాకాణి రమణారెడ్డి మరణానికి విచారం వ్యక్తం చేస్తూ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ నారాయణరెడ్డి, టిడిపి నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితర అనేకమంది నాయకులు, శాసనసభ్యులు, ప్రముఖులు సంతాపం ప్రకటిస్తూ ఆయన తనయుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితర కుటుంబసభ్యులకు వారు తమ సంతాపం ప్రకటించారు. మే 8 శనివారం నాడు వారి స్వస్థలమైన తోడేరులో ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఆయన లేని లోటు ఏనాటికీ తీరనిది. ఎవరూ తీర్చలేనిది.

# మన సతీష్‌రెడ్డి.. మానవతా సేవలు

- కరోనా బాధితులను ఆదుకునేందుకు 40 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల వితరణ



ఆపదకాలంలో జిల్లాలోని ప్రజలను మానవతా దృక్పథంతో ఆదుకునేందుకు నేనున్నానంటూ ముందుకు వస్తూ, తన శక్తిమేరా తగు సాయం అందిస్తున్నారు మన సతీష్‌రెడ్డి. డిఆర్‌డిఓ (భారత రక్షణ రంగ, పరిశోధన సంస్థ) ఛైర్మెన్‌గా దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న ఆయన, తాను పుట్టినగడ్డకు మేలు చేయాలనే తలంపుతో ఎప్పటికప్పుడు జిల్లాలోని పరిస్థితులను తెలుసుకుంటూ బాధితులకు తనవంతు సాయం అందిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నారు. జిల్లాలోని ఆత్మకూరు మండలంలోని మహిమలూరు గ్రామానికి చెందిన మన సతీష్‌రెడ్డి, కరోనా విలయంతో జిల్లా ప్రజలు బెంబేలెత్తుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వ్యాధితో బాధలు పడుతున్నవారికి ఆక్సిజన్ సిలిండర్లు అందజేసి వారి ప్రాణాలు నిలిపేందుకు తనవంతు చేయూతనందిస్తున్నారు. ఇటీవలే జిల్లాకు 40 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ కిట్లను ఆయన జిల్లాకు పంపించారు. వాటిని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు పరిశీలించి బాధితులకు పంపిణీ చేయించారు. నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రికి 10 సెట్లను కేటాయించారు. డివిజన్‌కు 5 సెట్ల వంతున పంపించారు. కరోనా వ్యాధి లక్షణాలు స్వల్పంగా ఉండి పెద్దాసుపత్రి క్యాజువాలిటీలో ఉన్నవారికి వీటి ఉపయోగం ఎంతగానో ఉంటుందని, వీటిద్వారా బాధితులకు మేలు కలుగుతుందని కలెక్టర్ చెప్పారు.

### మహిమలూరులో ఇంటింటికి మాస్కులు

డిఆర్‌డిఓ ఛైర్మెన్ డా.గుండ్రా సతీష్‌రెడ్డి తన స్వస్థలమైన మహిమలూరు గ్రామంలోని ప్రజలు కరోనా బారినపడకుండా ఉండేందుకు పెద్దసంఖ్యలో మాస్కులు, శానిటైజర్లు వితరణగా పంపించి జన్మభూమికి తనవంతు సేవలందిస్తున్నారు. వాటిని ఆర్డీఓ చైత్రవర్షిణి సూచనలతో మహిమలూరులోని ఇంటింటికీ రెండు మాస్కులు, ఒక శానిటైజర్ వంతున పంపిణీ చేసేందుకు తహశీల్దార్ సుభద్ర, ఎంపిడిఓ శ్రీనివాసులు చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ పి.చంద్రశేఖర్, ఉప సర్పంచ్ ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, విఆర్‌ఓ కృష్ణయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# నేదురుమల్లికి నివాళి

దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఏడవ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 9న వాకాడులో జరిగిన కార్యక్రమంలో ఆయన కుమారుడు, వైకాపా నాయకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఘన నివాళులర్పించారు. వాకాడులోని తమ నివాసంలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులు జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వాకాడు ప్రాంతాభివృద్ధికి తమ తండ్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఎనలేని కృషిచేశారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లోనే నడిచి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానన్నారు.. నేదురుమల్లి వర్ధంతి సందర్భంగా బాలిరెడ్డిపాలెం ఆసుపత్రి వద్ద ఉన్న పేదలకు వాకాడు సహకార సంఘాధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి పండ్లు, రొట్టెలు అందజేశారు. తహసీల్దార్ సారంగపాణి, సీఐ నరసింహారావు, ఎస్సై నాయక్, సర్పంచ్ వెంకటరత్నమ్మ, వైకాపా నాయకులు దయాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, షఫీల్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ అభివృద్ధికి 'పెద్దాయన' కృషి మరువలేనిది



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కూడా స్వర్గీయ నేదురుమల్లి జనార్ధనరెడ్డి 7వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కళాశాల సంచాలకులు డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పడడానికి నేదురుమల్లి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆనాడు జనార్ధన్‌రెడ్డి చేసిన కృషితోనే నేడు కళాశాల ప్రతిభతో ముందుకు సాగుతూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. ఏఐసిటిఈ, న్యాక్, యుజిసి వంటి దేశస్థాయి సమగ్ర గుర్తింపులు ఉండడం వల్ల బహుళ జాతి పరిశ్రమలతో కలిసి పనిచేయడం జరుగుతోందని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉండడం వల్ల విద్యార్థులకు ఈ కళాశాలలో అన్ని విధాలుగా ఉత్తమ శిక్షణ ఇవ్వగలుగుతున్నామని అన్నారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు, ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తండ్రి ఆశయాల బాటలో నడుస్తూ కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

## స్టాఫ్ నర్సు మృతి బాధాకరం

వాకాడు సామాజిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ కరోనా బారిన పడి చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై స్టాఫ్ నర్సు సుభాషిణి మృతిచెందడం బాధాకరమని హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. ఆమె మరణం వైద్య ఆరోగ్యశాఖకు తీరని లోటన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ఆయన తన సానుభూతిని తెలిపారు.






# ఆంధ్రా సియంకి రావలసినంత మైలేజీ వస్తున్నదా?



ఆంధ్రప్రదేశ్‌లో గల 175 అసెంబ్లీ స్థానాలలో 151 స్థానాలలో విజయం సాధించి, మొత్తం దేశాన్నే నివ్వెరపరచిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నాయకత్వం వహించడం ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తి అవుతున్నది. అంటే.. పదవీకాలంలో దాదాపు సగం అయిపోయినట్టే. మరో రెండేళ్ళు గడిస్తే ఎన్నికల ఏడాదిలోకి అడుగుపెడతాం. ఇక, అప్పుడు ఏమి మాట్లాడినా... ఏమి చేసినా ఎన్నికలు కదా అన్న భావంతోనే చూస్తారు. అందువల్ల, నాలుగేళ్ళ అయ్యేసరికి ప్రభుత్వ వ్యవహారశైలిపై ప్రజలు ఒక అభిప్రాయానికి వచ్చేస్తారు. జగన్‌కు మళ్లీ ప్రభుత్వాన్ని అప్పగించాలా వద్దా అనే విషయంలో వారు 2023 చివరి నాటికే డిసైడ్ అయిపోతారు. వారిలో ఒక స్పష్టత వచ్చేస్తుంది. 'అవును...కాదు' ఓటర్ల మధ్య తటస్థుల శాతం ఈసారి చాలా తక్కువగా ఉండే అవకాశం ఉంది. అమెరికాలో పిలిచినట్టే మనమూ వీరిని 'స్వింగ్ ఓటర్స్' అందాము. ఈసారి ఈ స్వింగ్ ఓటర్స్ పాత్ర నామమాత్రమే కావచ్చు. జగన్ పాలన బాగున్నదా... లేదా అన్న డోలాయమాన స్థితిలో ఉండే ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం లేదు. అయితే 'బాగుంది'.., కాకపోతే 'బాగాలేదు' అనే అభిప్రాయాల మధ్యనే ఓటర్లు చీలిపోయే అవకాశాలే ఎక్కువ.

కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాలు వారీగా రాష్ట్ర రాజకీయాలు నిట్ట నిలువుగా చీలిపోయివున్నాయి. మన దేశ రాజకీయాలకు ఈ అవలక్షణాలు కొత్త ఏమీ కాకపోయినా... మన రాష్ట్రానికి ఇవే ప్రామాణికం. ఎన్నికల నాటికి ఇవి మరింత బలంగా... మరింత నిర్ణయాత్మకంగా రూపు దిద్దుకోవచ్చు.



ఈ పరిస్థితుల నేపథ్యంలో జగన్ నేతృత్వంలోని ప్రభుత్వ వ్యవస్థ వ్యవహారశైలితో ప్రజలలో రావలసినంత అనుకూల మైలేజ్ వస్తున్నదా? ప్రభుత్వ వ్యవహారశైలిపై జనసామాన్యంలో ఎటువంటి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి? జనంలో ప్రభుత్వ అనుకూల... వ్యతిరేక విభజన ఏ స్థాయిలో ఉంది? పాలనా పరంగానూ... రాజకీయంగానూ పడుతున్న రోజువారీ అడుగులపై జన స్పందన ఎలా ఉన్నది? మంత్రుల పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు? వారి ప్రకటనల తీరు ఎలా ఉన్నది? సోషల్ మీడియాలో వైసీపీ-టీడీపీ అనుకూల, వ్యతిరేక ప్రచారాలు రాష్ట్ర రాజకీయాలను ఏమాత్రం ప్రభావితం చేస్తున్నాయి? అసలు ప్రభావితం చేస్తున్నాయా... లేదా? తెలుగుదేశం నాయకులు ప్రభుత్వం మీద చేసే ఆరోపణలు... విమర్శల ప్రభావం ప్రజల మీద ఏమేరకు ఉంది? వాటిని జనం సీరియస్‌గా తీసుకుంటున్నారా? 2024 ఎన్నికల నాటికి 'పవన్ కళ్యాణ్ అనే నేను...' పాత్ర ఏమిటి అని జనం భావిస్తున్నారు? ఆయన రాజకీయాలను ఏమేరకు ప్రభావితం చేయగలరు అని జనం అనుకుంటున్నారు? బీజేపీతో ఆయన ఎన్నికల వరకు నడవగలరని జనం భావిస్తున్నారా? అన్నట్టు, బీజేపీ పవన్‌కళ్యాణ్‌తో కలిసి పోటీచేస్తే.. ఇప్పటి పరిస్థితులలో ఎన్ని సీట్లలో డిపాజిట్ వచ్చే అవకాశం ఉన్నదని జనం అనుకుంటున్నారు?




ప్రభుత్వం జనం అకౌంట్స్‌లో నేరుగా వేస్తున్న లక్షలాది రూపాయల వల్ల... వారి జీవితాలలో వచ్చిన/వస్తున్న మార్పులు ఏమిటి? ఆ సొమ్ము సద్వినియోగం శాతం ఎంత? దుర్వినియోగం శాతం ఎంత? ప్రభుత్వం... జగన్ పట్ల లబ్దిదారులలో కృతజ్ఞత వ్యక్తమవుతున్నదా? వలంటీర్ వ్యవస్థ పట్ల ప్రజాభిప్రాయం ఏమిటి? దాని వల్ల తమకు ప్రయోజనం కలుగుతున్నదని జనం భావిస్తున్నారా?

ఇక, ప్రభుత్వ వ్యతిరేక యూ ట్యూబ్ చానెళ్లు, టీవీ5, ఏబీఎన్ లాంటి రెగ్యులర్ న్యూస్ చానెళ్ళు చేస్తున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం ప్రజల ఆలోచనలను ఏమేరకు ప్రభావితం చేస్తున్నాయి? వీటి ప్రచారం వల్ల తెలుగుదేశం పార్టీకి ఏమైనా పొలిటికల్ మైలేజ్ వస్తున్నదా? లేదూ సాక్షి, టీవీ9, 10టీవీ, ఎన్టీవీ వంటి అనుకూల ఛానళ్ల ప్రచారాన్ని జనం ఎంత సీరియస్‌గా తీసుకుంటున్నారు? అసలు, మీడియా అనుకూల, వ్యతిరేక ప్రచారాల వల్ల జనం ప్రభావితం అయ్యే శాతం ఎంత? ఏ విషయాల ప్రాతిపదికగా వారు ప్రభావితం అవుతారు? ప్రభుత్వానికి జగన్ సారథ్యం మొదలైన తరువాత, ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీ తనం ఏమేరకు పెరిగింది? లేదా తగ్గింది? అవినీతి స్థాయి పెరిగిందా... లేక తగ్గిందా? వారి ఊరి/వార్డు సచివాలయం... పోలీస్‌స్టేషన్... ఎం.ఆర్.ఓ ఆఫీస్ పనితీరుపై వారి అభిప్రాయం ఏమిటి?

శాసనసభ్యులు ఏమేరకు ప్రజలకు అందుబాటులో... జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నారు? కేంద్రం మనకు చేయవలసినంత సాయం చేస్తున్నదని... రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటున్నదని ప్రజలు భావిస్తున్నారా?

'ప్రత్యేకహోదా' అంశంపై ప్రజల మనోభావాలు ఎలా ఉన్నాయి? వచ్చే ఎన్నికల నాటికి ఇది 'కోతి పుండు- బ్రహ్మ రాకాసి' సామెత చందంగా తయారై కూర్చుంటుందా? ప్రత్యేక హోదా సాధనకు రాష్ట్ర ప్రభుత్వం ఏమిచేయాలని ప్రజలు భావిస్తున్నారు? వచ్చే ఎన్నికలలో ఈ అంశానికి జనంలో ఎంత ప్రాధాన్యం లభించే అవకాశం ఉంది? డైలీ సీరియల్‌లాగా సాగుతున్న వైసీపీ ఎం.పీ రఘు రామకృష్ణరాజు ఎపిసోడ్‌పై జనాభిప్రాయం ఏమిటి? ఇదొక కామెడీషోగా జనం భావిస్తున్నారా... లేక, జగన్ ప్రతిష్టను ఆయన దెబ్బ తీస్తున్నారని జనం అనుకుంటున్నారా? దీని ముగింపు జనం దృష్టిలో ఏమిటి? వైసీపీ నుంచి ఆయనను బహిష్కరించ లేక పోవడానికి కారణం ఏమిటని వారు అనుకుంటున్నారు? తెలుగుదేశం పరిస్థితి ఏమిటి? 23 దగ్గరే ఉన్నదా... లేక పెరిగిందా? 2024 నాటికి వైసీపీని సవాలు చేయగల స్థితికి టీడీపీ చేరుకోగలదని జనం భావిస్తున్నారా? జనం దృష్టిలో నారా లోకేష్ ఎక్కడ ఉన్నారు? ఆయన స్టాండింగ్ ఏమైనా మెరుగుపడిందా? బీసీలు, కాపులలో అధిక భాగం ఎటు చూస్తున్నారు? ఎందుకని? ఇలా అనేకానేక ప్రశ్నలకు ప్రజలేమని అనుకుంటున్నారో సాధికారికంగా ముఖ్యమంత్రి తెలుసుకోవలసిన అవసరం కనపడుతుంది. ఇందుకు రెండు కారణాలు.

రెండున్నర సంవత్సరాల తరువాత మొత్తం మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరిస్తాను అని ఆయనే స్వయంగా ప్రకటించారు. మరో ఆరు నెలల్లో ఆ గడువు ముగుస్తుంది. ఇప్పుడున్న మంత్రుల వ్యవహారశైలిపై ప్రజాభిప్రాయం తెలిస్తే ఎవరిని ఉంచాలో.. ఎవరిని తొలగించాలో అనే విషయమై ఆయనకు స్పష్టత వస్తుంది. తమ తమ శాసన సభ్యుల వ్యవహారశైలిపై ఆయా నియోజక వర్గాల అభిప్రాయాన్ని కూడా ఈ సర్వేలో తెలుసుకుంటే మంత్రి పదవులకు ఎవరు తగినవారు అనే స్పష్టత కూడా ముఖ్యమంత్రికి వస్తుంది.

ఈ సర్వేను ఐ.ఐ.టి మద్రాసు, లేదా ఐ.ఐ.ఎం. బెంగళూరు, లేదా... అహ్మదాబాద్ వంటి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సంస్థలకు అప్పగిస్తే క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితి ఏమిటనేది ముఖ్యమంత్రికి తెలుస్తుంది.ఆ నివేదిక ఆధారంగా మిగిలిన రెండు సంవత్సరాల పాలనను, వ్యవహారశైలిని, రాజకీయ నడవడికను ట్యూన్ చేసుకోవచ్చు. ఈ ప్రశ్నలకు టీవీ యాంకర్లు, డిబేటిషియన్లు, రాజకీయ నాయకులు, పడక్కుర్చీ విశ్లేషకులు... ఇలా ఎవరైనా.. అనుకూలంగానో, వ్యతిరేకంగానో సమాధానాలు చెప్పవచ్చు. రాజకీయ ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియనివి కావు. కానీ, ఓటర్ల దృష్టిలో వాటికి దమ్మిడీ విలువ ఉండదు. వారి మెజారిటీ అభిప్రాయమే శిరోధార్యం... ప్రామాణికం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గత రెండేళ్లుగా దిశా నిర్దేశం చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి ఈ దిశగా ఆలోచిస్తారా అన్నదే అసలైన ప్రశ్న.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## ప్రభుత్వ ఆసుపత్రికి జేవివి ఆక్సిజన్



గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9న 30 ఆక్సిజన్ సిలెండర్స్ రీఫిల్ చేసి అందించారు. ఇక్కడ అనేకమంది కరోనా రోగులకు ఆక్సిజన్ అందక ప్రాణాలు పోతున్న విషయాన్ని ఆర్.యం.ఓ శైలజ జనవిజ్ఞాన వేదికకి తెలియజేయగా, జేవివి వారు మిని లారీ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రం విజయ్ బాబు సహకారంతో ప్రతి రోజు 30 సిలెండర్లలో ఆక్సిజన్ రీఫిల్ చేసి 5 రోజులు పాటు (150 సిలెండర్స్) ఆసుపత్రికి అందించారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## తహసీల్దార్‌గా.. మళ్ళీ లీలారాణి



గతంలో గూడూరులో ఎమ్మార్వోగా ఎంతో నిబద్ధతతో పని చేసిన బి.లీలారాణి ఎన్నికల సమయంలో బదిలీల్లో భాగంగా ఇందుకూరుపేటకి బదిలీ అయ్యారు. మళ్ళీ ఇప్పుడు తిరిగి గూడూరు ఎమ్మార్వోగా నియమితులయ్యారు. క్రమశిక్షణతో పని చేసే ఆమె నియామకంతో గూడూరు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. లాబీయింగ్ బాబులుకు మాత్రం ఇది చేదు వార్తే!

## శ్రీకంటి జన్మదినాన సేవా కార్యక్రమాలు



ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, ఏపీ బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షుడు, ఎస్.వి.రత్నం ఛారిటీస్ అధినేత శ్రీకంటి రామ్మోహన్‌రావు తన జన్మదినాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 11వ తేదీకి ఆయన 70 సంవత్సరాలు పూర్తి చేసుకుని 71వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా సబ్‌కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ సూచనల మేరకు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణారావుకు 30 ఆక్సిజన్ సిలిండర్లు అందజేశారు. అలాగే పదిమంది బ్రాహ్మణులకు, పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయగా, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేస్తానని శ్రీకంటి తెలిపారు.



ఏపీ బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివ కుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, డి. బాలశ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రాజీ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వీడి.. కరోనాను నిరోధించాలి



ఈద్గా యూత్ అసోసియేషన్ సభ్యులకు రాంజాన్ తోఫా అందజేస్తున్న డా. రోహిణి దంపతులు

మానవుని చివరి మజిలీ అయిన అంత్యక్రియలను కూడా నిర్వహించుకోలేని దుస్థితికి తీసుకువచ్చిన కరోనా మహమ్మారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు చెరుకూరు జనార్దన్‌రెడ్డి, చెరుకూరు రోహిణి దంపతులు అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించి ఈద్గా యూత్ అసోసియేషన్ చేపడుతున్న సేవలు ఎనలేనివని వారు కొనియాడారు. ఈనెల 8వతేదీన ఈద్గా అసోసియేషన్‌లోని ఐదుగురు సభ్యులకు తమ నివాసంలో వారు రంజాన్ తోఫా అందించారు. బియ్యం బస్తాతో పాటు ఒక్కో కేజీ చొప్పున పది రకాల సామగ్రిని వీరికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్లక్ష్యం వల్లనే కరోనా సెకండ్‌వేవ్ స్టేజికి మనం చేరుకున్నామని, ఈ పొరపాటు మళ్ళీ చేయకుండా జాగ్రత్తపడాలని కోరారు. సెకండ్‌వేవ్‌లో యువత అధికంగా మృతి చెందడంపై వారు ఆవేదన వ్యక్తంచేస్తూ, రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈద్గా యూత్ సేవలకు చేయూతగా అంబులెన్స్ ఏర్పాటుకు కూడా తమ సహకారం ఉంటుందని వారు ఈ సందర్భంగా చెప్పారు.

## ఈద్గా యూత్‌కు పేర్నాటి పీపీఈ కిట్లు

కుల, మతాలకు అతీతంగా కరోనా మృతులకు దహన సంస్కారాలు చేస్తున్న ఈద్గా యూత్ అసోసియేషన్‌కు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, పేర్నాటి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సోమవారం వంద పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలోని దర్గా ఆవరణంలో ఈద్గా యూత్ సభ్యులు మాట్లాడుతూ కరోనా తొలిదశ నుండే మృతి చెందిన కోవిడ్ బాధితుల వద్దకు కుటుంబసభ్యులు కూడా రాలేని పరిస్థితిని గమనించి ఈద్గా ప్రాంతానికి చెందిన ఇరవై మంది స్నేహితులం ఒకటై దహన సంస్కారాలు, ఖనన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సేవలను గుర్తించిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తమను నెల్లూరులోని తన ట్రస్ట్ కార్యాలయానికి పిలిపించి, వంద పీపీఈ కిట్లు అందించారని పేర్నాటికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మళ్ళీ కరోనా కష్టాల్లో..
# ప్రైవేటు ఉపాధ్యాయులు
### ప్రభుత్వం ఆదుకోవాలని అభ్యర్థన

కరోనా రెండోదశ విజృంభిస్తుండడంతో జిల్లాలోని ప్రైవేటు ఉపాధ్యాయుల పరిస్థితి మళ్ళీ దీనంగా, దయనీయంగా మారింది. గత ఏడాదిలాగే ఇప్పుడు కూడా కరోనా ప్రభావంతో పాఠశాలలు మూతపడడంతో అరకొర జీతంతో ప్రైవేటు ఉపాధ్యాయుల జీవనం కష్టంగా తయారైంది. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేటు పాఠశాలలు సుమారు వెయ్యి ఉన్నాయి. వీటిలో సుమారు యాభైవేలమందికి పైగానే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. ఆ పాఠశాలలకు అనుబంధంగా ఉండే ఆయాలు, వాహనాల డ్రైవర్లు, వాచ్‌మెన్ తదితర సిబ్బంది అంతా ఇప్పుడు పాఠశాలలు మూతపడి వేతనాలు అందకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకునేందుకు నానా అవస్తలు పడుతున్నారు. పేదవర్గాలుగా ఉన్న తమను ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని, కుటుంబానికి కనీసం 5వేల రూపాయల వంతునైనా తక్షణ సాయం అందించి తమను ఈ కష్టాల నుంచి గట్టెక్కించాలని వారంతా అభ్యర్థిస్తున్నారు.

## కరోనాతో సీనియర్ అసిస్టెంట్ కామాక్షి కన్నుమూత



నెల్లూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కామాక్షి ఇటీవల కరోనాతో కన్నుమూశారు. కరోనా సోకడంతో గత కొద్దిరోజులుగా ఆమె చికిత్సలు పొందుతూ ఈనెల 7న మరణించారు. ఆమె మృతికి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి అబ్రహాం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## వెంకటాచలం మండలం వైకాపా నేత మృతి
### - నివాళులర్పించిన కాకాణి

వెంకటాచలం మండలం వైకాపా అధ్యక్షుడు కరియావుల చెంచుకృష్ణయ్యనాయుడు ఇటీవల మృతిచెందారు. 80 ఏళ్ల వృద్ధాప్యంలో కూడా ఆయన వైకాపాకు ఎంతో సేవలందించారని, పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన వైకాపాలో ఉంటూ ఎంతో నిబద్ధతతో నిజాయితీతో పార్టీకి సేవచేశారని వైకాపా నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు. చెంచుకృష్ణయ్యనాయుడి నివాసానికి వెళ్ళి భౌతికకాయాన్ని సందర్శించి ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాకాణి వెంట వైకాపా నాయకుడు మందల వెంకటశేషయ్య తదితరులున్నారు.

## వైద్యసిబ్బందికి పిపిఇ కిట్లు పంపిణీ

వెంకటగిరిలోని సిహెచ్‌సి వైద్యశాలలో ఇటీవల టివిఎస్ అనుబంధసంస్థ అయిన శ్రీనివాసన్ సేవాసంస్థ ఆధ్వర్యంలో వైద్యసిబ్బందికి 315 పిపిఇ కిట్లు, శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు అందజేసి ఔదార్యం చాటుకున్నారు. ఈ సామగ్రిని ఇన్‌చార్జి ఎంపిడిఓ విజయలక్ష్మి చేతుల మీదుగా డాక్టర్ శ్రీనివాసులుకు అందజేశారు. సిహెచ్‌సి వైద్యుడు శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జి నందగోపాల్, శశి, అలేఖ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## అనాధ చిన్నారులకు
## సాయం

మాతృదినోత్సవం సందర్భంగా ఈనెల 8న బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు సేవాసమితి వారు బుచ్చిరెడ్డిపాళెంలోని మదర్ హోం అనాధాశ్రమంలో ఉన్న చిన్నారులకు తమవంతు సాయం అందించారు. ఒక నెలకు సరిపడా బియ్యం, పప్పుదినుసులు, కూరగాయలు, కోడిగుడ్లతో పాటు కోవిడ్ నుంచి రక్షణగా శానిటైజర్లు అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు.

## నిరుపేద ముస్లింలకు
## నిత్యావసర సరుకులు

రంజాన్ పండుగను పురస్కరించుకుని కొడవలూరు మండలంలోని నార్తురాజు పాళెం గ్రామంలో ఉన్న పలువురు నిరుపేద ముస్లిం కుటుంబాల వారికి ముస్లిం జేఏసి కమిటీ సభ్యులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జేఏసి అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు ఎస్‌కె మౌలాన మహమ్మద్, యూసఫ్, కార్యదర్శి సాదిక్ తదితరులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గుండెపోటుతో
## టిడిపి నాయకుడు
## దేవళ్ళ కన్నుమూత

బుచ్చిరెడ్డిపాళెం మండలం సీనియర్ టిడిపి నాయకుడు, ఇస్కపాళెం మాజీ సర్పంచ్, జిల్లా తెలుగురైతు ఉపాధ్యక్షుడు దేవళ్ళ కమలాకర్‌రెడ్డి (70) ఇటీవల గుండెపోటుతో మరణించారు. మండల టిడిపి మాజీ అధ్యక్షుడు హరికృష్ణ తదితర టిడిపి నాయకులు ఆయన మృతికి చింతిస్తూ ఆయన కుటుంబసభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

## బ్యాంకు సిబ్బందిలో కరోనా కలవరం
### ఇద్దరు ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్లు కన్నుమూత

జిల్లాలోని బ్యాంకుల సిబ్బందిని కరోనా కలవరపెడుతోంది. కరోనా వ్యాధితో జిల్లాకు చెందిన ఇద్దరు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు మృతిచెందడంతో బ్యాంకు వర్గాలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నాయి. నెల్లూరులోని ఎస్‌బిఐ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ కొత్తపల్లి హరినాగేశ్వరాచారి చెన్నైలోను, నాయుడుపేట ఎస్‌బిఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నెల్లూరులోనూ కరోనా బారినపడి చికిత్సలు పొందుతూ ఇటీవల మరణించడంతో ఉద్యోగులంతా ఆందోళన చెందుతున్నారు. ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సందానిబాషా, ఉద్యోగ సంఘం నాయకులు ఎస్‌కె మనోజ్‌తో పాటు ఉద్యోగులందరూ వారి మృతికి విచారం వ్యక్తంచేస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

## 15వ ఆర్థికసంఘం నిధులొచ్చేశాయ్
### జిల్లాలోని పంచాయతీలకు ఊరట

జిల్లాలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతిరాజ్ శాఖ విడుదల చేయడంతో పంచాయతీలకు కాస్తంత ఊరట కలిగింది. అసలే ఆర్థికస్థితి అంతంత మాత్రంగా ఉన్న పంచాయతీలు ఈ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలు కలుగుతుంది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండో విడత నిధులు ఇటీవల విడుదల కావడంతో ఆ నిధులను 2011 జనాభా లెక్కల ప్రాతిపదికగా పంచాయతీలకు కేటాయిస్తున్నామని, మొత్తం 944 పంచాయతీలకు 26,73,76,700 రూపాయలు విడుదలయ్యాయని, జిల్లాలోని అన్ని పంచాయతీలకు ఆ నిధులను జమ చేస్తున్నామని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు.

## ఇద్దరు అధికారులను పొట్టనబెట్టుకున్న కరోనా



కిశోర్‌బాబు



సుధాకర్

కోవిడ్ వైరస్ జిల్లాలో ఉధృతమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రంగాల అధికారులు, సిబ్బంది కూడా కరోనా బారిన పడుతూ బాధలు పడుతున్నారు. అనేకమంది ఈ వ్యాధికి బలవుతున్నారు కూడా. ఇటీవలే తెలుగు గంగ, సోమశిల సర్కిల్స్‌లో ఇద్దరు అధికారులు ఈ వ్యాధితో మరణించడంతో ఆయా రంగాల అధికారులు, ఉద్యోగులు అంతా బెంబేలెత్తిపోతున్నారు. కరోనా బారిన పడి గుండెపోటుకు గురై సోమశిల డివిజన్-2 సాంకేతిక అధికారి పి.సుధాకర్ మృతిచెందడం ఉద్యోగవర్గాలను శోకసాగరంలో ముంచింది. అదేవిధంగా తెలుగుగంగ సర్కిల్ పరిధిలోని ఎస్ఎస్ఎల్‌సి, ఎస్‌బి డివిజన్-1 ఇంజనీర్ టి.కిశోర్‌బాబు కూడా గత కొద్దిరోజులుగా కరోనాతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఇటీవల మృతిచెందారు. వీరి మృతికి విచారం వ్యక్తం చేస్తూ అధికారులు, ఉద్యోగసంఘాలు వారిద్దరి కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపం తెలిపాయి.

# సర్వమత సమానత్వానికి ప్రతీక.. 'వేనాడు' దర్గా



*జిల్లాలో శాంతి-సహనాలకు ప్రతీకగా, మత సామరస్యానికి పతాకలుగా నిలిచిన ఎన్నో పవిత్రమైన దర్గాలున్నాయి. నెల్లూరు బారాషహీద్ దర్గా, ఏఎస్‌పేట దర్గా, కసుమూరు మస్తానయ్య దర్గా.. ఇలా ఎన్నో ప్రసిద్ధమైన దర్గాలకు, ప్రార్థనామందిరాలకు నెలవుగా అలరారుతోంది.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా. జిల్లాలోని అనేక విశిష్టమైన దర్గాల్లో తడ మండలంలోని వేనాడులో కొలువైవున్న హజరత్ షేక్ దావూద్ షావలి దర్గా మరెంతో విశేషమైనది కూడా. అందులోనూ ఈ దర్గా ఆసియా ఖండంలోనే అత్యంత పొడవున్న దర్గాగా కూడా విఖ్యాతి పొందింది. ప్రతి ఏటా ఇక్కడ జరిగే గంధోత్సవాలకు దేశ విదేశాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తుంటారు.*

**మన దేవాలయాలు (47)**

సర్వమత సమానత్వానికి ప్రతీకగా ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులో విస్తరించిన పులికాట్ సరస్సు మధ్యభాగంలోని వేనాడు దీవిలో ఈ దర్గా నెలకొని ఉంది. అందుకే ఈ దర్గాను 'వేనాడు దర్గా' అనే పేరుతోనూ, మరికొందరు భక్తులు 'అల్లా తాత' దర్గా అని కూడా పిలుస్తుంటారు. శ్రీహరికోట మార్గం నుంచి అటకానితిప్ప వద్ద మీదుగా పులికాట్ సరస్సులో పది కిలోమీటర్ల దూరం వెళ్తే అక్కడ వేనాడు దీవిలో సుప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో వెలసివున్న ఈ దర్గాను మనం దర్శించుకోవచ్చు.

### దర్గా చరిత్ర :

చుట్టూ సముద్రపు నీళ్ళు..చల్లని గాలులు..దూరంగా కనిపించే శ్రీహరికోట, అతిపెద్ద సరస్సుగా ప్రఖ్యాతిగాంచిన పులికాట్ సరస్సు..ఈ సరస్సు మధ్యలో వేనాడుదీవి..ఇవన్నీ తడ మండలంలోని చరిత్రాత్మక ప్రాంతాలుగా, అందరూ చూడాల్సిన దర్శనీయ క్షేత్రాలుగా చెప్పుకోవచ్చు. కొంతకాలం క్రితమే ఈ ప్రాంతంలో రోడ్డు మార్గం ఏర్పాటైంది. దీంతో వేనాడుకు రాకపోకలు కొంత సులువయ్యాయి. శ్రీహరికోట రాకెట్ కేంద్రం ఏర్పడిన తర్వాత చుట్టుపక్కల ఉన్న అనేక ప్రాంతాలతో పాటు వేనాడు ప్రాంతం కూడా బాగా అభివృద్ధి చెందుతూ ఉంది.

### ఆసియాలోనే..అత్యంత పొడవైన దర్గా :

ఆసియా ఖండంలోనే అత్యంత పొడవైన దర్గాగా ఇదెంతో ప్రసిద్ధి చెందింది. ఇప్పటికే ఈ సమాధి 144 అడుగులకు పైగానే ఉండి ఆసియా ఖండంలోనే అత్యంత పొడవైన సమాధి కలిగిన దర్గాగా పేరొందింది. ఎప్పుడో వందల ఏళ్ళ క్రితం నాటి ఈ దర్గా నేటికీ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ ఉంది. ఈ దర్గా ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథనాలున్నాయి. దాదాపు ఆరువందల ఏళ్ళ క్రితం షేక్ దావూద్ అనే మహనీయుడు ఈ ప్రాంతానికి వచ్చారని, ఇక్కడ పశువుల కాపర్లతో కలసి ఉంటూ, ఎంతోమంది వ్యాధులను నివారించేవారని, సర్వమత సమానత్వాన్ని ప్రబోధించేవారని, దీంతో ఆయన్ను అందరూ బాబాగా పిలుచుకునేవారని చెప్తుంటారు. ఆ తర్వాత బాబా ఒకరోజున తాను సమాధి అవుతున్నానని, తన శరీరాన్ని ఇసుకతో కప్పి ఉంచాలని చెప్పారని, దీంతో పశువుల కాపర్లు ఆయన చనిపోగానే ఇసుకతో సమాధి చేశారని, అదేరోజు రాత్రి గాలి వాన రావడం, మరుసటి రోజు వచ్చి చూసేసరికి బాబా సమాధి పొడవుగా పెరగడం గమనించారని, దీంతో బాబావారు ఎంతో మహిమాన్వితుడని గుర్తించి నాటి నుంచి బాబా వారికి భక్తితో పూజలు చేయడం ప్రారంభించారని అంటారు. బాబా మహిమతో నేటికీ భక్తులు కోరుకున్న కోర్కెలు నెరవేరుతుంటాయని భక్తులు ఎంతగానో విశ్వసిస్తుంటారు. అందుకు తగ్గట్లుగానే ఎంతో మహిమోపేతమైన బాబా సమాధి నేటికీ జీవం ఉన్నట్లుగా ప్రతిస్పందిస్తుండడం బాబా మహిమలకు ప్రత్యక్ష నిదర్శనమని కూడా భక్తులు చెప్తుంటారు.

### ప్రతి ఏటా గంధమహోత్సవాలు :

భక్తుల కొంగుబంగారంగా వెలసిన వేనాడు దర్గాలో ప్రతి ఏటా గంధ మహోత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతుంటాయి. ముస్లిమ్ సోదరులు, హిందువులు, కులమతాలకు అతీతంగా వేలాదిమంది భక్తులు దర్గాను దర్శించుకుని బాబా వారి దివ్యాశీస్సులను పొందుతుంటారు. ప్రపంచ ప్రఖ్యాతిచెందిన సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వంటి సుప్రసిద్ధులు ఈ దర్గాను దర్శించుకోవడమే కాక దర్గా అభివృద్ధికి కృషి చేస్తుండడం విశేషం. మతసామరస్యానికి నిదర్శనంగా వేనాడు గ్రామస్తులు ఈ దర్గాలో నిత్యం పెద్దఎత్తున పూజలు, ఏటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా ప్రతి అమావాస్య రోజున, ఏడాదికోసారి జరిగే గంధోత్సవం రోజున భక్తులు వేలాదిగా తరలివచ్చి ఈ దర్గాను దర్శించుకుని తరిస్తుంటారు.

## పోలీసు అధికారులు, సిబ్బందికి..

# ప్రతిభా పురస్కారాలు

### నెల్లూరు డిఎస్పీ శ్రీనివాసులురెడ్డికి మహోన్నత సేవా పతకం



నెల్లూరు నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం అందించే విశిష్ట మహోన్నత సేవాపతకం లభించింది. అంతేకాదు మరికొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది కూడా విశిష్టమైన సేవా పతకాలకు ఎంపికై జిల్లా పోలీసు శాఖ గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేయడం సంతోషకరం. ఈ ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, అగ్నిమాపకశాఖ, విజిలెన్స్, ఏసిబి తదితర విభాగాల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. ఆ జాబితాలో జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి కూడా సేవా పతకాలు లభించాయి. ఇందులో ప్రతిష్టాత్మకమైన పోలీస్ మహోన్నత సేవా పతకానికి నెల్లూరు నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఎంపిక కాగా, పోలీస్ ఉత్తమ సేవాపతకానికి ఏఆర్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. పోలీస్ సేవా పతకానికి హోంగార్డ్స్ డిఎస్పీ డి.శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్, గూడూరు పట్టణ సిఐ దశరథరామారావు, జలదంకి ఏఎస్ఐ సాదినేని హరిబాబు, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ దాచూరు సురేష్‌బాబు, 9వ బెటాలియన్ ఏఆర్ఎస్ఐలు కృష్ణయ్య, పరంధామయ్య, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ టి.మహీధర్‌రెడ్డి, కావలి ఒకటవ పట్టణ హెడ్‌కానిస్టేబుల్ పొంగూరు పెంచలయ్య, వేదాయపాళెం హెడ్‌కానిస్టేబుల్ కె.వెంకట సుధాకర్, 9వ బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్ టి.వి శేషాద్రి, నెల్లూరు ఆర్‌వి అండ్ ఇఒ కానిస్టేబుల్ పెంచలయ్య, ఏసిబి కానిస్టేబుల్ వంశీకృష్ణ, ఎస్టీఎస్టీ పిఎస్ కానిస్టేబుల్ మల్లికార్జునలకు లభించాయి. అదేవిధంగా సేవా పతకాలకు ఎంపికైన వారిలో సూళ్ళూరుపేట అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్ఓ చలమయ్య, ఎల్ఎఫ్ విజయకుమార్, నాయుడుపేట అగ్నిమాపకకేంద్రం ఎల్ఎఫ్ శ్రీనివాసులు, కావలి అగ్నిమాపకకేంద్రం డ్రైవర్ ఆపరేటర్ శ్రీహరి ఎంపిక కావడంతో జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్, ఏఎస్పీ వెంకటరత్నం, ఎస్ఇబి జేడీ శ్రీలక్ష్మి తదితరులు ఈ విశిష్ట పతకాలకు ఎంపికైన వారిని అభినందించారు.

### సేవా పురస్కారం అందుకున్న గూడూరు సిఐ దశరథరామారావు



గూడూరు పట్టణ సీఐ దశరథరామారావుకు పోలీసు సేవా పురస్కారం లభించింది. 1998 బ్యాచ్‌కి చెందిన దశరథరామారావు పోలీసుశాఖలో అంచెలంచెలుగా ఎదిగి కల్మషంలేని వ్యక్తిగా అందరికీ దగ్గరయ్యాడు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ని ప్రజలకు చేరువ చేసి, సామాన్య ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పించారు. తన ఇరవై ఏళ్ల సర్వీసులో ఏ ఒక్క రిమార్కు లేకుండా ఉన్నతాధికారుల మెప్పును పొందారు. ప్రకాశంజిల్లా ఒంగోలుకు చెందిన ఆయన 2003 నుంచి నెల్లూరు పోలీసు డివిజన్‌లో పనిచేస్తూ శాఖాపరంగా విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం దశరథరామారావుకు సేవా పురస్కారం ప్రకటించింది. ఈ సందర్భంగా సీఐ దశరథరామారావు మాట్లాడుతూ తన అన్నయ్య గోలి తిరుపతిరావు తండ్రి స్థానంలో ఉండి నిత్యం ప్రతి విషయంలో తనను ప్రోత్సహించబట్టే తాను విధి నిర్వహణలో ప్రతిభ చూపగలిగానని అంటూ విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# కోవిడ్ కట్టడికి.. 13 లక్షల వితరణ



జిల్లాలో కోవిడ్ నియంత్రణకు ముత్తుకూరు మండలం పంటపాళెంలోని సంతోషిమాత ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ విరాళం అందజేసింది. ఆ కంపెనీ యూనిట్ హెడ్ గణేష్, ఇన్‌ఛార్జి కె.సతీష్ 13 లక్షల రూపాయల చెక్కును ఈనెల 11న మంగళవారం నెల్లూరులో కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరోనా నిరోధానికి అవసరమైన మాస్కులు, పీపీఈ కిట్లు, ఆక్సిజన్, మందులు తదితర వాటి కొనుగోలుకు తమవంతు సాయంగా ఆ కంపెనీ 13 లక్షలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు.

# టీడీపీ నాయకుడు పడవల కృష్ణమూర్తి కన్నుమూత



టీడీపీ నాయకుడు పడవల కృష్ణమూర్తి ఈనెల11వతేది మంగళవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా ఆయన అస్వస్తతతో ఉన్నారు. గతంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా, 47వ డివిజన్ ఇన్‌ఛార్జిగా పనిచేసి పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కృష్ణమూర్తి మరణానికి చింతిస్తూ మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సిటీ ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావం కలిగిన సీనియర్ నాయకుడిని పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# డాక్టర్ రాధా జ్యోత్స్నలత మృతి



ప్రముఖ డాక్టర్, వైకాపా మహిళా నేత డాక్టర్ రాధా జ్యోత్స్నలత కరోనాతో చికిత్స పొందుతూ ఈనెల 10న చెన్నైలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో మృతిచెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. సేవా దృక్పధంతో ఎంతోమంది నిరుపేదలకు వైద్యసేవలు అందిస్తూ ఆమె మంచి పేరు గడించారు. గూడూరు ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి ఆమె ఎనలేని సేవలందించారు. గూడూరు పట్టణానికి చెందిన ఆమె రాజకీయ రంగప్రవేశం చేసి 2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున శాసనసభ ఎన్నికల్లో గూడూరు నుంచి పోటీచేసి ఓడిపోయారు. ఆ తరువాతకాలంలో ఆమె వైకాపాలో చేరారు. రాష్ట్ర మహిళానేతగా గుర్తింపు పొందారు. ఆమె ఆకస్మిక మృతికి చింతిస్తూ పలువురు వైకాపా నాయకులు, ప్రముఖులు తమ సంతాపం ప్రకటించారు.

# సతీష్‌రెడ్డి ఫ్లెక్సీకి.. బిజెవైఎం క్షీరాభిషేకం

నెల్లూరు జిల్లా ముద్దుబిడ్డ డీఆర్‌డీఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి ఫ్లెక్సీ కటౌట్‌కు బీజేవైఎం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈనెల11న నెల్లూరులోని సంతపేట ప్రాంతంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ కరోనా మహమ్మారిని నిరోధించడం కోసం సతీష్‌రెడ్డి 2-డియాక్సి-డి-గ్లూకోజ్ (2-డీజీ) మందును తయారుచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. పొడిరూపంలో ఉండే ఈ మందును నీటిలో కలుపుకుని తాగడంద్వారా వెంటనే వైరస్ సోకిన కణాల్లోకి చేరి కోవిడ్ వ్యాప్తిని అడ్డుకుంటుందన్నారు. షణ్ముఖం బాబు, దువ్వూరు నాగేంద్ర, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## స్మృత్యంజలి



మీ జ్ఞాపకాలు అజరామరం..

మీ ఆశయాలు అమరం!

మీ స్మృతులతో...

**కీ॥శే॥ శ్రీ కె.వి.రమణయ్య - శ్రీమతి రమాదేవి**

| కుమారులు - కోడళ్లు | కుమార్తెలు - అల్లుళ్లు |
|---|---|
| కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన | సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి |
| కనుపర్తి దయాశంకర్ - రేణుక | జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహశర్మ |

మనవళ్ళు, మనవరాళ్ళు మరియు మునిమనుమరాలు


## కాలధర్మం

### బి.వి.నగేష్(బాబు)



బెంగుళూరు నగరానికి చెందిన బి.వి.నగేష్ తన 63వ ఏట మే 6వతేదీ బెంగుళూరులో కన్నుమూశారు. వ్యాపారవేత్తగా ఈయన ప్రసిద్ధి. సౌమ్య గుణమున్న మిత్రుడిగా, అజాతశత్రువుగా ఆయన అందరికీ తెలుసు. మంచి స్నేహ స్వభావమున్న నగేష్‌కి చాలామంది నెల్లూరీయులతో ఆత్మీయ సంబంధాలు ఉన్నాయి. వయసుతో పనిలేకుండా, చిన్నా పెద్దా అన్న తారతమ్యం లేకుండా అందరూ నగేష్‌ని బాబన్నా అని ఆప్యాయంగా పిలుచుకుంటారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుకు రావడం ఆయన సహజ తత్వమని ఆయన మిత్రులు గుర్తు చేసుకుంటున్నారు. తమ బాబన్న లేని లోటు తమకు ఎవరూ తీర్చలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగేష్‌కి భార్య, ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### ఉంగరాల నిరంజన్



కోరా, రత్నం విద్యాసంస్థలలో సుదీర్ఘకాలం అకౌంటెంట్‌గా పనిచేసిన తిరుపతి వాస్తవ్యుడు ఉంగరాల నిరంజన్ తన 53వ ఏట మే11వ తేదీ, మంగళవారం రాత్రి తిరుపతిలో తుదిశ్వాస విడిచారు. నిరంజన్‌కి భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. తిరుపతి రూరల్‌లోని పేరూరు ఆయన స్వగ్రామం. నిరుపేద రైతు కుటుంబంలో జన్మించిన నిరంజన్ కష్టపడి చదువుకుని జీవితంలో స్థిరపడ్డాడు. 1990 నుండి 1998 వరకూ నెల్లూరులో కోరా విద్యా సంస్థలలో పనిచేయడంతో పాటు, అనంతరం కొన్ని సంవత్సరాలు రత్నం విద్యా సంస్థలలో కూడా నిరంజన్ తన సేవలు అందించాడు. తరువాతి కాలంలో తన దృష్టిని వ్యాపార రంగంవైపు మరల్చుకుని కాంట్రాక్టర్‌గా మారాడు. ఈయన ప్రముఖ ఆడిటర్ కాసు సుధాకరయ్యకు శిష్యుడు. నెల్లూరులో పరిచయాలు, నెల్లూరుతో అనుబంధం ఎక్కువ. నిరంజన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# చంద్రపడియలో మళ్ళీ.. ఘోరం!

**• రసాయన కర్మాగారంలో ప్రమాదం • ముగ్గురు కార్మికుల దుర్మరణం**



కర్మాగారం లోపలి భాగం

జిల్లాలోని వింజమూరు మండలం చంద్రపడియ గ్రామం దగ్గరున్న ఓ ఫార్మా కర్మాగారంలో ఈ నెల 11న మళ్ళీ ప్రమాదం జరిగింది. గత ఏడాది జులై 29న ఈ కర్మాగారంలో రియాక్టర్ పేలి ఇద్దరు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్ళీ ప్రమాదం జరగ డంతో కార్మికులు, కార్మిక కుటుంబాల వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఫ్యాక్టరీలో రసాయనాల గ్యాస్ లీకై ఊపిరాడక ముగ్గురు కార్మికులు అత్యంత దయనీయంగా మృతిచెందడం జిల్లా ప్రజలను కలచివేసింది.

పోలీసులు, అధికారుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చంద్రపడియ సమీపంలోని వెంకట నారాయణ యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులు యధావిధిగా ప్రొడక్షన్ విభాగంలో పక్కపక్కనున్న రెండు రియాక్టర్లలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా విషవాయువులు వెలువడి ఊపిరాడక ముగ్గురు కార్మికులు మరణించినట్లు చెప్తున్నారు. ఈ ప్రమాదంలో వింజమూరు మండలం యర్రబల్లిపాలెంకు చెందిన మెట్లుపల్లి తిరుపతయ్య (62), ఏఎస్‌పేట మండల నివాసి వెలుగోటి తిరుపతయ్య (61), వింజమూరులో కాపురం ఉంటున్న ఒంగోలుకు చెందిన బెల్లంకొండ శ్రీనుబాబు (28) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు కార్మికులు షరీఫుద్దీన్, బాలకృష్ణ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే కావలి డీఎస్పీ ప్రసాద్, ఆత్మకూరు ఆర్డీఓ చైత్రవర్షిణి హుటాహుటిన వచ్చి కర్మాగారాన్ని పరిశీలించారు. ఈ ఘటనకు సంబంధించి ఫ్యాక్టరీ యాజమన్యంపై కేసు నమోదు చేశామని, ఈ సంఘటన ఎలా జరిగిందో సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని ఆర్డీఓ తెలిపారు. గతంలో ప్రమాద సంఘటనలు జరిగినా యాజమాన్యం సరైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనందున ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సంఘటన వివరాలడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

### ప్రముఖుల విచారం

ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఈ దుర్ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఫ్యాక్టరీలో మళ్ళీ ప్రమాదం జరిగి కార్మికులు మృతిచెందడం పట్ల మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం దురదృష్టకరమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ఫ్యాక్టరీ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని సోమిరెడ్డి కోరారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు విచారం వ్యక్తం చేస్తూ, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కోరారు.

# ఆక్సిజన్ ఇచ్చి.. బాధితులను ఆదుకోండి

**— బిజెపి నాయకుని విజ్ఞప్తి**

రాష్ట్ర ప్రభుత్వం ఆక్సిజన్ సరఫరాతోపాటు పడకల సంఖ్య పెంచి కరోనా రోగులను ఆదుకోవాలని భాజపా నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. నగరంలోని భాజపా కార్యాలయంలో ఈనెల 11న జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోగుల సంఖ్యకు సరిపడా ఆక్సిజన్ సరఫరా లేక ఊపిరాడక వారు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులకు అవసరమైన ఆక్సిజన్‌ను అందజేసి వారిని ఆదుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పడకల వివరాలు, మరణాలపై ఏరోజుకారోజు హెల్త్ బులిటెన్ విడుదల చేయాలని కోరారు. బిజెపి నాయకులు మిడతల రమేష్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రుయా ఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణం

తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో రోగుల మరణాలు సంభవించడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని పౌరహక్కుల సంఘం నాయకుడు ఎల్లంకి వెంకటేశ్వర్లు ఈనెల 11న ఒక ప్రకటనలో ఆరోపించారు. కరోనా రెండో దశపై నిపుణులు, శాస్త్రవేత్తలు, మేధావులు ముందుగానే హెచ్చరించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని, దీంతో వైరస్ ఉధృతి తీవ్రమైందని ఆయన పేర్కొన్నారు. రుయా ఆసుపత్రిలో దుర్ఘటనపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆక్సిజన్ అందక 10 రోజుల్లో 50 మందికి పైగా మరణించారని, ఇకనైనా ప్రభుత్వాలు మేల్కొని బాధితులను ఆదుకోవాలని ఆయన కోరారు.

# నిరుపేదలకు 'వాకర్స్' మందులు

కరోనో సోకి, హోమ్ ఐసోలేషన్‌లో ఉన్న నిరుపేద రోగులకు ఉచితంగా మందులు అందించనున్నట్లు నెల్లూరులోని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఏకొల్లు రాఘవరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్, స్టైల్ వాకర్స్ ఏసీ స్టేడియం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల9న పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ వైరస్ సోకి ఇళ్లల్లోనే ఉంటున్న నిరుపేదలకు రెడ్‌క్రాస్ సిఫార్సు చేసిన మందులను ఇస్తామని తెలిపారు. ఈ మందులు అవసరమైన వారు ఫోన్ ద్వారా తమను సంప్రదించినా, వారి ప్రతినిధులను పంపినా మందులు అందిస్తామన్నారు. మందులు అవసరమైన వారు 93999 78783, 90305 71115, 94417 86275నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టైల్ వాకర్స్ అసోసియేషన్ ట్రెజరర్ వెంకట సత్యనారాయణ, సోము భక్తవత్సలరెడ్డి, వాదనాల వెంకటరమణ, ఆర్.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసులురెడ్డి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వీక్షణం

- మంజీరారెడ్డి

# ఆ రోజు మదర్స్ డే

మనిషి దేనికి భయపడుతున్నాడు? దేనికి భయపడడం లేదు? ఈ ప్రశ్నకు బదులివ్వడం బహుశా ఎవరి తరమూ కాదేమో! ఒక తరం వెనక్కి వెళ్తే ఓ అర్థవంతమైన భయం అర్థమవుతుంది. అమాయకత్వం నిండిన భయం స్నిగ్ధంగా గుర్తుకు వస్తుంది. తొలిదెబ్బైలలో పుట్టిన వాళ్లకు ఓ సంఘటన అంతో ఇంతో జ్ఞాపకం ఉండే ఉంటుంది. అదే స్కైలాబ్. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ఆకాశంలోకి వదిలిన సాంకేతిక బాణం ఈ స్కైలాబ్. ఈ స్పేస్ స్టేషన్‌ని నాసా 1973లో అంతరిక్షంలోకి పంపిస్తే అది 1979 జూలైలో నేలకు వెతుక్కుంటూ వచ్చి హిందూ మహా సముద్రంలో దూకింది. ఎక్కడ ఏ నలుగురు కాదు ఇద్దరు కలిసినా ఇదే చర్చ. పంచాయితీ రచ్చబండపై ఒకరు పేపర్ చదువుతుంటే మిగిలిన వాళ్లు వింటూ ఉండేవాళ్లు. ఆ తర్వాత ఆ విషయం మీదనే చర్చలు. స్కూలుకెళ్తే టీచర్లు కూడా స్కైలాబ్ గురించే మాట్లాడుతుండేవాళ్లు. పిల్లలు చాలా ఆసక్తిగా, కొంచెం భయంగా టీచర్ల మాటలు వింటూ ఉండేవాళ్లు. 'స్కైలాబ్ ఆకాశం నుంచి ఊడిపోయిందట(ఆ వయసుకు తెలిసిందంతే), నేల మీద పడిపోతుందట. అది కానీ పెంకుటింటి మీద పడిదంటే... కప్పు చిల్లు పడిపోయి అమాంతం భూమిలోకి చొచ్చుకుని పోతుందట. మా అమ్మమ్మ వాళ్లది మిద్దె ఇల్లు. మా అమ్మ బట్టలు సర్దుతోంది. రేపు మా అమ్మమ్మ వాళ్ల ఊరికి పోతున్నాం' అని రోజూ ఆడుకునే స్నేహితులతో బెంగగా చెప్పుకున్న బాల్యం ఇప్పుడు యాభైకి కొంచెం అటూ ఇటూగా ఉంటుంది. స్కైలాబ్ ఢీకొంటే మిద్దె ఇల్లే కాదు, బంగళాకూడా నిలవదు. మిద్దెలు, బంగళాల్లో ఉన్న వాళ్లకు కూడా ప్రాణాపాయమే అని తెలియని అమాయకత్వం ఆ తరం అమ్మానాన్నలది. ఒకవేళ తెలిసినా... ఆ దుర్ఘటనలో ఆత్మీయులకు దగ్గరగా ఉండాలనే భావోద్వేగం కూడా కావచ్చు. ఆ సంఘటన తలుచుకుంటే అమాయకత్వం కూడా అందంగానే అనిపిస్తోంది.

### విలాసాల వైరాగ్యం

ఇక్కడ మరోకోణం కూడా ఉంది. సంపన్నుల్లో కొందరు స్కైలాబ్ పడితే అంతా శ్మశానమైపోతుంది. ఈ డబ్బు, ఆస్థులు ఉండి చేసేదేముంది... అనుకుని మొత్తం అమ్ముకుని విలాసాల్లో మునిగి తేలిన వాళ్లూ ఉన్నారు. ఏది ఏమైనా... సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ప్రతి ఒక్కరూ ముంచుకు వస్తున్న ఒక విపరిణామాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. మనిషి పుట్టుకకు– మరణానికి మధ్య జీవితం అనేది ఒకటుందని గమనించారు. జీవితం అంతమై పోతుందేమోననే ఆందోళనలో కూడా జీవితేచ్ఛను బతికించుకున్నారు. అది నైన్‌టీన్ సెవెన్‌టీ ప్లస్.

కంప్యూటర్ పరిజ్ఞాన యుగంలో వైటూకే దాటి ట్వంటీ ట్వంటీ కూడా దాటి ట్వంటీ వన్‌లోకి వచ్చాం. చైనా ఈ ఏడాది ఏప్రిల్‌లో 'లాంగ్‌మార్చ్ 5బి' రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపింది. ఒక శకలం విడిపోయి ఆకాశంలోకి వెళ్లినంత వేగంగా భూమిని వెతుక్కుంటూ వస్తోందని వార్తలు వచ్చాయి. అయినా... ఎవ్వరిలోనూ చలనం కలగలేదు. చూద్దామన్నా సరే... ఎవరిలోనూ ఏ మాత్రం ఆందోళన కనిపించలేదు. అంతో ఇంతో ఆందోళన పడిన వాళ్లు శాస్త్రవేత్తలు మాత్రమే. అది ఎప్పుడు నేలకు తాకుతుందో, ఏ ప్రదేశానికి ముప్పు వాటిల్లుతుందోనని వాళ్లు హెచ్చరిస్తూనే ఉన్నారు. మే నెల ఎనిమిద తేదీ రాత్రి ఏడున్నర నుంచి పదవ తేదీ అర్థరాత్రి ఒంటి గంట మధ్యలో ఎప్పుడైనా భూమిని తాకవచ్చు అనే అంచనాలు వెల్లువెత్తాయి. రాకెట్ శకలం ప్రయాణిస్తున్న వేగాన్ని, భూమి పరిభ్రమించే వేగాన్ని లెక్క వేస్తూ ఏ అక్షాంశాలు, ఏ రేఖాంశాల మధ్యలో భూమిని తాకే అవకాశం ఉందోననే లెక్కల్లో సైంటిస్టులు తల మునకలవుతుంటే, చదువుకున్న సామాన్యులు మాత్రం ఐపీఎల్ వాయిదా పడిన వార్తకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపించారు. మొత్తానికి ఆదివారం నాటి తెల్లవారు జామున చైనా లాంగ్ మార్చ్ 5 బీ రాకెట్ శకలం కూడా స్కైలాబ్‌లాగానే హిందూ మహాసముద్రంలో పడిపోయింది. ఘోర విపత్తు తప్పిపోయిన తర్వాత కూడా హాయిగా ఊపిరి పీల్చుకున్నది సైంటిస్టులు మాత్రమే. బహుశా పాలకులు కూడా లోలోపల ఒక బరువు తీరిందనుకుని ఉండవచ్చు. సామాన్యులు మాత్రం 'ఎక్కడ! ఇండియన్ ఓషన్‌లోనా. ఓకే' అనుకుని తిరిగి సోషల్ మీడియాలో 'మదర్స్ డే' శుభాకాంక్షలు తెలియచేయడంలో మునిగిపోయారు. అమ్మకు నేరుగా శుభాకాంక్షలు చెప్పకుండా ఫేస్‌బుక్‌లో చెప్పడం ఇప్పటి ట్రెండ్ కాబోలు. తల్లి కదా అన్నింటినీ భరిస్తుంది. భూమి తల్లి కూడా అంతే.

చైనా రాకెట్ శకలం సముద్రంలో పడిన రోజు మే నెల రెండవ ఆదివారం, మదర్స్ డే. ప్రపంచం మొత్తం మాతృదినోత్సవం జరుపుకుంటుంది. కానీ ఆరోజు భూమి తల్లికి ఎవరూ శుభాకాంక్షలు చెప్పరు, అయినా భూమాత అన్నింటినీ భరిస్తుంది. పిల్లల తప్పులన్నింటినీ తనలో ఇముడ్చుకుంటుంది. పిల్లలు సాధించిన గొప్పలను మాత్రమే సమాజానికి ఇస్తుంది. అప్పుడు అమెరికా సైంటిస్టుల వైజ్ఞానిక అభివృద్ధిలో జరిగిన తొట్రుపాటును, ఇప్పటి చైనా టెక్నాలజీ విప్లవంలో దొర్లిన పొరపాటును కూడా తన గర్భంలో దాచుకుంది. తన బిడ్డ సొంతంగా అడుగులు వేస్తుంటే చూసిన తల్లి ఒక పక్క మురిసిపోతూనే, అడుగు నిలదొక్కుకోలేక బిడ్డ పడిపోతాడోనని, పడిపోబోతుంటే పడనివ్వకుండా పట్టుకోవడానికి అనుక్షణం బిడ్డను కాచుకునే ఉంటుంది. భూమితల్లి కూడా అంతేనని, వైజ్ఞానికంగా అడుగులు వేస్తున్న బిడ్డను అనుక్షణం కాచుకుంటూనే ఉంటుందని మరోసారి నిరూపితమైంది. ఇక్కడ మనిషి తప్పనిసరిగా తెలుసుకోవాల్సింది ఒకటుంది. కన్నతల్లి తొమ్మిది నెలలు మోసి కన్న జీవితానికి సార్థకతతో జీవించాలి అని. జీవితేచ్ఛ లేకుండా జీవించడం అంటే 'పుట్టించడానికి మోసిన కన్నతల్లి శ్రమనూ, బతికినన్నాళ్లూ మోస్తున్న భూమి తల్లి ఔదార్యాన్ని అవమానించడమే.

# పోలీసంటే శంకర్‌లా ఉండాలి

**నిస్సహాయులైన చిన్నారులకు సాయం అందించాడు**

రోడ్డు ప్రమాదంలో తల్లిని కోల్పోవడం, తండ్రి వికలాంగుడిగా మారడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న వారి పిల్లలైన అయిదుగురు చిన్నారులకు మానవతా దృక్పథంతో తనవంతు సాయం అందజేసి మనుబోలు పోలీస్ కానిస్టేబుల్ ఆర్.శంకర్ అందరి అభినందనలు అందుకున్నాడు. సాటి సిబ్బంది తదితరుల నుంచి చందాలు సేకరించి మొత్తంగా 40వేల రూపాయలను ఆ చిన్నారులకు అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం గ్రామానికి చెందిన షేక్ సాజీద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆమె భర్త షేక్ అహ్మద్ కూడా వికలాంగుడయ్యాడు. దీంతో వారి బిడ్డల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న శంకర్ వారికి తనవంతు సాయం చేయాలని నిర్ణయించుకుని, తనతో పాటు తనతోటి సిబ్బంది తదితరుల నుంచి డబ్బు సేకరించి 'మీ కోసం ఫౌండేషన్' ద్వారా ఆ చిన్నారుల సహాయార్థం అందించాడు. 'పోలీసంటే శంకర్‌లా ఉండాలి' అనిపించుకుంటూ అందరి ప్రశంసలందుకుంటున్నాడు.

# పెద్దాయనకి భాష్పాంజలి



## శ్రీ కాకాణి రమణారెడ్డి గారు

నిర్యాణం : 07.05.2021

7 దశాబ్దాలకు పైగా నెల్లూరుజిల్లా రాజకీయాలలో
తనదైన ముద్ర వేసుకున్న ఆదర్శ పురుషులు

అరుదైన వ్యక్తిత్వం, సేవాతత్త్వం కలిగిన
నిరాడంబర నాయకులు, నిస్వార్థ ప్రజా సేవకులు

నాకు అత్యంత ఆప్తులు, మా కుటుంబ ఆత్మీయులు
మా పెద్దాయన

## రమణారెడ్డి గారి

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...
వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.
భాష్పాంజలితో...

**గునుపాటి మురళీకృష్ణారెడ్డి**
హైదరాబాదు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com